ప్రజాశక్తి

శుక్రవారం 31 మే 2024 8 పేజీలు





గుంటూరు పల్నాడు

పల్నాడులో అప్రకటిత కర్ఫ్యూ!

- లెక్కింపునకు ముందే అధికారులు హడావుడి
- చిరువ్యాపారులు, సామాన్యులకు ఇక్కట్లు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లాప్రతినిధి



ఎంకి పెళ్లి సుబ్బి చావుకొచ్చినట్టు సార్వత్రిక ఎన్నికలు ఈసారి పల్నాడులో సామాన్య ప్రజలు, చిరు వ్యాపారులు, రోజు వారీ కూలీలకు తీవ్ర ఇబ్బంది కలిగిస్తున్నాయి. ఈనెల 12 నుంచి జిల్లా వ్యాప్తంగా 144 సెక్షన్ అమలులో ఉంది. పోలింగ్ రోజున, తరువాత పల్నాడులోని కొన్ని ప్రాంతాల్లో ఘర్షణలు జరిగాయి. 13వ తేదీ నుంచి ఇప్పటి వరకు జరిగిన ఘర్షణలకు సంబంధించి మొత్తం 161 కేసులు నమోదయ్యాయి. ఇప్పటి వరకు 1320 మందిని అరెస్టు చేశారు. ఇప్పటికీ అరెస్టులు కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో జూన్ 4న జరగనున్న ఓట్ల లెక్కింపు నేపథ్యంలో పల్నాడు జిల్లా మొత్తం అధికారులు ముందస్తు చర్యలు చేపట్టారు.

జూన్ ఒకటి నుంచి దుకాణాలు, వ్యాపార సంస్థలు మూసివేయాలని జిల్లా ఎస్‌పి మల్లికా గర్గ్ ఆదేశించారు. ఈ మేరకు నరసరావుపేటలో వ్యాపారులు కూడా అంగీకరించారు. శనివారం సాయంకాలం ఐదు గంటల వరకు మాత్రమే వ్యాపార లావాదేవీలు కొనసాగించి 2, 3, 4, 5 (ఆది, సోమ, మంగళ, బుధ) తేదీలు పూర్తిగా షాపులు మూయవలసినదిగా ఎస్‌పి ఇచ్చిన ఆదేశాల మేరకు వ్యాపారాలు మూసివేస్తున్నట్టు నరసరావుపేట ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు కొత్తూరి కిషోర్‌బాబు, ప్రధాన కార్యదర్శి గాదంశెట్టి రామకృష్ణ, కోశాధికారి పచ్చిపులుసు జగన్నాథరావు ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా మొత్తం ఇదే నిర్ణయం తీసుకున్నామని వివరించారు. అయితే ఏదైనా అవాంఛనీయ ఘటనలు, ఘర్షణలు జరిగితే నాల్గో తేదీ మధ్యాహ్నం తరువాత జరిగే అవకాశం ఉంటుంది. కానీ ఒకటో తేదీ సాయంత్రం నుంచి వ్యాపారాలు మూసివేయడం వల్ల వ్యాపార సంస్థల్లో పనిచేసే రోజు వారీ కూలీలు, ముఠా వర్కర్లు, గుమాస్తాలు, చిరువ్యాపారులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉంది. 4వ తేదీన ఫలితాల తరువాత ఘర్షణలు జరిగితే తగిన చర్యలు తీసుకోవడం సబబే కానీ ముందుగానే మూడు రోజుల పాటు పూర్తిగా ఉపాధిని దెబ్బతీయడంపై తగదని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు.

పల్నాడుజిల్లాలో భారీగా బలగాలు ఉన్నాయి. పోలింగ్

2లో

ఓట్ల లెక్కింపునకు సర్వం సిద్ధం

- ఊరేగింపులు, ర్యాలీలకు అనుమతుల్లేవు
- కౌంటింగ్ రోజున హైవే పక్కన దుకాణాలు బంద్
- బైండవర్ నిబంధనలు ఉల్లఘిస్తే జైలుకే : పల్నాడు జెసి

ప్రజాశక్తి - మాచర్ల



నరసరావుపేట మండలం కాకాని పరిధిలోని జెఎన్‌టియు కాలేజీలో 4న ఓట్ల లెక్కింపునకు ఏర్పాట్లన్నీ సిద్ధమని మాచర్ల రిటర్నింగ్ అధికారి, పల్నాడు జిల్లా జాయింట్ కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ తెలిపారు. ఆయన తన కార్యాలయంలో గురువారం విలేకర్లతో మాట్లాడారు. ఏ టేబుల్ వద్ద సిబ్బంది ఎవరు ఉంటారో ఎవరికీ తెలియదని, 4వ తేదిన ఉదయం 8 గంటలకు ఆయా టేబుల్స్ వద్ద ఎవరు డ్యూటి చేస్తారో తెలియజేస్తామని చెప్పారు. సిబ్బందికి ఇప్పటికే శిక్షణిచ్చామని, మరోసారి జూన్ 3వ తేదిన శిక్షణిస్తామని చెప్పారు. పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికల ప్రక్రియకు 14 టేబుల్స్ చొప్పున కౌంటింగ్ ప్రక్రియ ఉంటుందన్నారు. పోస్టల్ బ్యాలెట్స్ లెక్కింపుకు 3 టేబుల్స్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఏజెంట్లు క్రమశిక్షణతో ఉండేలా చూసుకోవాల్సిన బాధ్యత అభ్యర్థులదేనన్నారు. అభ్యర్థులు ఆర్‌ఓ టేబుల్ దగ్గర ఉండవచ్చునని తెలిపారు. ప్రతి రౌండ్ ఫలితాలను ఎన్నికల వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేస్తామన్నారు. సాయంత్రం 4 గంటలలోపు ఫలితాల ప్రకటించేందుకు కౌంటింగ్ ప్రక్రియను సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. ఫలితాల సందర్భంగా ర్యాలీలకు అనుమతులుండవని స్పష్టం చేశారు. కౌంటింగ్ రోజున కూడా144 సెక్షన్ పటిష్టంగా అమలవుతుందన్నారు.

2లో

రాష్ట్రమంతా మనవైపు చూస్తోంది..

- అభ్యర్థులు హ్యాపీగానే ఉంటారు.. పౌరుషాలకు పోతే జీవితం నాశనం
- శాంతిభద్రతల పరిరక్షణలో మాకు సహకరించండి
- పల్నాడు జిల్లా ప్రజలకు ఎస్పీ మలిక గర్గ్ విన్నపం

ప్రజాశక్తి - వినుకొండ



మాట్లాడుతున్న ఎస్పీ మల్లిక గర్గ్

పోలింగ్ రోజున పల్నాడు జిల్లాలో అరాచకం జరిగిందని, 160 కేసులు నమోదై రాష్ట్రంలో అశాంతికి నిలయంగా జిల్లా మూడో స్థానంలో ఉండడం బాధాకరమని జిల్లా ఎస్పీ మల్లికా గర్గ్ అన్నారు. వినుకొండ పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ వద్ద గురువారం రాత్రి వినుకొండ పోలీస్ ఆధ్వర్యంలో శాంతి భద్రతలపై ప్రజలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఎస్పీ మాట్లాడుతూ పల్నాడులో జరిగిన దాడులు, ఘర్షణలు, ఫ్యాక్షన్ అల్లర్లు అరాచకంతో దేశంలోనే ఫేమస్ అయిందని, అటువంటి పలనాడు జిల్లాలో శాంతి భద్రతలను నిలిపేందుకు పోలీస్ శాఖ కట్టుదిట్టమైన చర్యలు తీసుకుందని చెప్పారు. మాచర్ల, నరసరావుపేట, వినుకొండ ప్రాంతాల్లో జరిగిన ఎన్నికల గొడవలు, కేసులతో ప్రసిద్ధిగాంచి పల్నాడులో ఏమి జరుగుతుందని రాష్ట్రమంతా మనవైపు చూసే పరిస్థితి నెలకొందన్నారు. పల్నాడు అంటేనే ఎంతో ప్రఖ్యాతిగాంచిందని, ఇక్కడ ప్రజలు ఆదరిస్తారనే మంచి నుండి రోడ్లపై కొస్తే చంపేస్తారనే ప్రజలు భావించే స్థితికి వెళ్లడం బాధాకరమన్నారు. 10 రోజుల్లో 160 కేసులు, 1300 మంది అరెస్టు, 400 మంది పై రౌడీషీట్లు ఓపెన్ చేయడమంటే సంవత్సరాలు గడిచిన ఇన్ని కేసులు అరెస్టు జరగవని, పల్నాడు ఎంతటి ప్రమాదంలో ఉందో ప్రజలు అర్థం చేసుకోవాలని కోరారు. అభ్యర్థులు హ్యాపీగా ఉంటారని, పౌరుషాలకు, పట్టుదలలకు వెళ్లి సామాన్యులు బలైపోతారని, కేసుల్లో ఇరుక్కొని మీ జీవితాలు నాశనం చేసుకోవద్దని సూచించారు. ఎన్నికల సమయంలో అల్లర్లకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తప్పవని, ఒక్క కేసైనా రౌడీ షీట్ ఓపెన్ చేస్తామని హెచ్చరించారు. వినుకొండలో బెట్టింగులు పెడుతున్నారని తెలిసిందని, దానిపై పోలీస్ నిఘా పెట్టామని

2లో

5లోగా పింఛన్ల పంపిణీ

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా



సామాజిక పింఛన్ల పంపిణీని 5వ తేదీలోపు చెల్లించాలని, ఇందుకు తగ్గట్టుగా ఏర్పాట్లు చేసుకోవాలని ఎంపిడిఒలు, మున్సిపల్ కమిషనర్లను పల్నాడు జిల్లా కలెక్టర్ శ్రీకేష్ లత్కర్ బాలాజీరావు ఆదేశించారు. ఈ మేరకు పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేటలోని కలెక్టరేట్ నుండి అధికారులతో గురువారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్ సమీక్షించారు. జిల్లాలో మొత్తం 280568 మందికి రూ.83.79 కోట్లు పంపిణీ చేయాల్సి ఉండగా వీరిలో 205607 మందికి డైరెక్ట్ బెనిఫిషర్ ట్రాన్స్ఫర్ ద్వారా రూ.61.68 కోట్లు, 74899 మందికి రూ.22.08 కోట్లను వారి ఇళ్ల వద్ద, పంపిణీ చేస్తామని చెప్పారు. లబ్ధిదార్లు సచివాలయాలకు తప్పనిసరిగా వెళ్లాల్సిన అవసరం లేదన్నారు. ఎండలు తీవ్రంగా ఉన్నందున బ్యాంకుల వద్దకు ఓకేసారి అందరు వెళ్లి ఎండలో నిల్చుని వడదెబ్బకు గురవ్వొద్దని సూచించారు. పింఛన్ల పంపిణీ సకాలంలో పూర్తయ్యేలా గ్రామీణాభివృద్ధి సంస్థ జిల్లా అధికారి బాధ్యత వహించాలన్నారు. ఇంటివద్దకే వెళ్లి ఇవ్వాల్సిన పింఛను సొమ్మును శుక్రవారం మధ్యాహ్నం రెండు గంటల్లోపు విత్ డ్రా చేయాలని ఆదేశించారు. బ్యాంకుల వద్ద పింఛను లబ్ధిదార్ల కోసం టెంట్, తాగునీరు తదితర ఏర్పాటు చేయాలని చెప్పారు.



తప్పెటగూళ్లు ప్రదర్శన ఇస్తున్న శ్రీకాకుళం కళాకారులు

అబ్బురపరిచిన జానపదులు

ప్రజాశక్తి-గుంటూరు

ఉత్తర అమెరికా తెలుగు సంఘం (నాట్స్) ఆధ్వర్యంలో స్థానిక వెంకటేశ్వరా వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో గురువారం పెద్ద ఎత్తున నిర్వహించిన జానపద, సాంస్కృతిక సంబరాలలో కళాప్రదర్శనలు ఆద్యంతం ఆబ్బురపరిచాయి. డప్పు నృత్యాలు, కోలాటం, కొమ్ముబూరలు ఇలా రెండు తెలుగు రాష్ట్రాల్లోని వివిధ ప్రాంతాలకు చెందిన జానపద కళాకారుల ప్రదర్శనలతో ఆ ప్రాంతం హెూరెత్తింది. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు అధ్యక్షతన జరిగిన సభలో నాట్స్ అధ్యక్షులు నూతి బాపయ్యచౌదరి (బాపు) మాట్లాడుతూ భాషే రమ్యం, సేవే గమ్యం నినాదంతో ఏర్పడిన నాట్స్ రెండు తెలుగు రాష్ట్రాల్లో అనేక సేవా కార్యక్రమాలు చేపడుతుందన్నారు. మహిళల స్వయం ఉపాధికి, వైద్య శిబిరాల ఏర్పాటు, గిరిజను అభివృద్ధికి నైపుణ్య శిక్షణ, విద్య, సాంస్కృతిక రంగాల్లో అనేక కార్యక్రమాలు చేపట్టామని తెలిపారు. రానున్న రోజుల్లో మరింత విస్తృతంగా చేస్తామన్నారు. ఎమ్మెల్సీ లక్ష్మణరావు మాట్లాడుతూ వలస ఆధునిక ప్రపంచంలో మనం పుట్టిన మూలాలు మరవకుండా, సొంత ప్రాంత కోసం నాట్స్ చేస్తున్న అభినందనీయం అన్నారు. నాట్స్ డల్లాస్ కోఆర్డినేటర్ రామినేని సత్య మాట్లాడుతూ మున్ముందు నాట్స్ సేవా కార్యక్రమాలు మరింత విస్తృతంగా చేపడతామని చెప్పారు. అనంతరం కళాకారులకు,

2లో



సన్మానం అందుకున్న ఉపాధ్యాయులతో నూతి బాపు, కెఎస్ లక్ష్మణరావు తదితరులు

నేడు నూతి బాపయ్య చౌదరి అభినందన సభ

ప్రజాశక్తి-గుంటూరు

ఉత్తర అమెరికా తెలుగు సంఘం అధ్యక్షులు నూతి బాపయ్య చౌదరి(బాపు) అభినందన కార్యక్రమం నేడు సాయంత్రం 6 గంటలకు బ్రాడీపేటలోని గుర్రం విజ్ఞాన కేంద్రంలో నిర్వహిస్తున్నట్లు విజ్ఞాన కేంద్రం మేనేజింగ్ ట్రస్టీ పాశం రామారావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అభినందన కార్యక్రమంలో ఎమ్మెల్సీ కె.యస్.లక్ష్మణరావు పాల్గొంటారన్నారు. నూతిబాపయ్య చౌదరి సాధారణ రైతు కుటుంబంలో జన్మించి అమెరికాలో ఉత్తర అమెరికా తెలుగు సంఘానికి అధ్యక్షులుగా ఎన్నికయి, మన రాష్ట్రంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు, సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారన్నారు. కావున ఈ అభినందన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

ప్రిన్సిపాల్ సృజనకు ఉత్తమ సేవా పురస్కారం

ప్రజాశక్తి - యడ్లపాడు



స్థానిక నారాయణ ఇం గ్లీష్ మీడియం స్కూల్ ప్రిన్సి పాల్ చెరుకూరి సృజనకు ఉత్తమ సేవా పురస్కారం లభించింది. ఉత్తర అమెరికా తెలుగు సంఘం(నాట్స్) వివిధ రంగాల్లో అత్యుత్తమ సేవలను అం దించిన వారిని గుర్తించి అందించే అరుదైన ఈ పుర స్కారాన్ని గురువారం గుంటూరు వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో ఈ సేవా పురస్కారాన్నీ నాట్స్ అధ్యక్షులు నూతి బాపయ్యచౌదరి, ఎమ్మెల్సి కెఎస్ లక్ష్మణరావు చేతుల మీదుగా ఆమె అందు కున్నారు. 30 మంది ఉపాధ్యాయులకు, ఐదు గురు కవులకు, పలు కళలకు చెందిన కళాకారులకు, 100 మంది జానపద కళాకారులతో పాటు ఈ పురస్కారం అందు కోవడం ఆనం దంగా ఉందని సజన తెలిపారు. ఈ సంద ర్భంగా పలువురు గ్రామపెద్దలు, ప్రముఖులు సజనను అభినందించారు.



మధ్యాహ్న భోజనం నిర్వాహకుల వంటకాలను పరిశీలిస్తున్న ఎంఇఒలు

వంట నిర్వాహకులకు శిక్షణా తరగతులు

ప్రజాశక్తి-పెదనందిపాడు రూరల్

పాఠశాలలలో మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులు. ఆహార పదార్థాలు మెనూ ప్రకారం తయారుచేసి పిల్లలకు వడ్డించాలని జిల్లా రిసోర్స్ పర్సన్ షేక్ పర్వీన్ అన్నారు. పెదనందిపాడు జడ్పీ పాఠశాలలో మధ్యన్న భోజనం పథకం నిర్వాహకులకుమండల స్థాయి లో గురువారం ఏర్పాటుచేసిన శిక్షణా తరగతుల లో నిర్వాహకులు వంటల్లో తీసుకోవాల్సిన పలు జాగ్రత్తలు గురించి పర్వీన్ వివరించారు. ఆకుకూరలలో పోషక విలువలు తగ్గకుండా చూడాల్సిన బాధ్యతలు నిర్వాహకులపై ఉందని మండల విద్యాశాఖ అధికారులు 1. బాల సుబ్రమణ్యం 2 జాకబ్ లు అన్నారు. అనంతరం నిర్వాహకులు వంటల ను అధికారులు పరిశీలించి రుచిగా వండినపలువురు నిర్వాహకులకు బహుమతులు అందజేశారు.

నిర్మాణసామగ్రిన తరలిస్తున్న వ్యక్తుల అరెస్ట్

ప్రజాశక్తి - తుళ్లూరు

రాజధాని ప్రాంతం రాయపూడి దగ్గర ఉన్న ఐ ఎ ఎస్, ఐ పి ఎస్ అధికారుల భవన సముదాయం వద్ద నిల్వ ఉంచిన రాజధాని నిర్మాణ సామగ్రిని అక్రమంగా తరలిస్తున్న వ్యక్తులను పోలీసులు బుధవారం అరెస్ట్ చేశారు. సుమారు రూ 50 వేలు విలువ చేసే పాత ఇనుము,270 ఇనుప రాడ్లను రెండు ఆటోల్లో తరలించేందుకు ప్రయత్నించిన ఇద్దరు వ్యక్తులు,మరో ఇద్దరు మహిళలతో పాటు ఇద్దరు ఆటో డ్రైవర్లను అదుపు లోకి తీసుకున్నామని,సామగ్రిని స్వాధీనం చేసుకున్నా మని సిఐ ఎస్ కె సుభాని తెలిపారు.

అడ్వాన్స్ కేన్సర్ పరిశోధనలో భారత్‌కు అమెరికా సాంకేతిక సహాయం

కెఎల్ యు ఆచార్యులు డాక్టర్ ఎం.జానకిరామయ్య

ప్రజాశక్తి-తాడేపల్లి రూరల్

భారతదేశంలో అడ్వాన్స్ కేన్సర్ పైన జరుగుతున్న పరిశోధనలకు అమెరికా సాంకేతిక పరంగా సాయమందించడానికి ముందుకు వచ్చినట్లు కెఎల్ డీమ్డ్ యూనివర్శిటీ బయోటెక్నాలజీ ప్రొఫెసర్ డాక్టర్ ఎం.జానకిరామయ్య గురువారం తెలిపారు. ప్రస్తుతం భారతదేశంలో క్యాన్సర్ కారకాలను ముందుగానే గుర్తించే టెక్నాలజీ లేని కారణంగా కేన్సర్ సోకిన చివరి దశలో గుర్తించడం వలన క్యాన్సర్ రోగి ప్రాణాలను కాపాడలేకపోతున్నామని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కేన్సర్‌ను తొలిదశలో గుర్తిస్తే రోగి ప్రాణాలను కాపాడవచ్చునని అన్నారు. అందుకోసం అమెరికా సాంకేతిక సహకారం అందించాలని గతంలో అమెరికా పర్యటన సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ , అమెరికా అధ్యక్షుడు బైడెన్ ను అభ్యర్థిం చినట్లు పేర్కొన్నారు. అయితే, అమెరికా భారత్ కు అడ్వాన్స్ కేన్సర్ పరిశోధనలకు సాంకేతిక సహకారం అందించడానికి ముందుకు వచ్చినట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో భారత్ కు ఎలాంటి సాంకేతిక సహకారం అవసరమో తెలుసుకునేందుకు గాను ఈ నెల 28న డిల్లీ సమీపంలోని ఎయిమ్స్ నేషనల్ క్యాన్సర్ ఇనిస్టిట్యూట్, జాజ్జర్ లో ఇండో-అమెరికా మూన్ షాట్ మీట్ పేరుతో అంతర్జాతీయ స్థాయి సద స్సును నిర్వహించినట్లు చెప్పారు. ఆ సదస్సుకు దక్షిణ భారతదేశం నుండి కెఎల్ యు కు చెందిన ఆచార్యులు డాక్టర్ ఎం.జానకిరామయ్యను ఆహ్వానించగా ఆయన ఈ సదస్సులో పాల్గొని తన పరిశోధనల గురించి వారికి వివరించడంతో పాటు భారత్ కు అమెరికా అందించాల్సిన సాంకేతిక సహకారం గురించి ఆ సదస్సుకు తన సలహాలను, సూచనలను తెలియజేశారని, అమెరికా నుండి వచ్చిన బంద సభ్యులు ఆయన సలహాలను, సూచనలను స్వీకరించినట్లు ఆయన చెప్పారు.

ఈ సందర్భంగా అడ్వాన్స్ కేన్సర్ పరిశోధన గ్రూపు 2 జీనోమిక్స్, ప్రెసిషన్ మెడిసిన్ కు ఆచార్య డాక్టర్ ఎం.జానకిరామయ్యను ఎంపిక చేశారని తెలిపారు. భారత్ కు అమెరికా సాంకేతిక సహకారం కనుక కార్యరూపం దాలిస్తే భారత్ లో కేన్సర్ మరణాల రేటును గణనీయంగా తగ్గించవచ్చని ఆచార్యులు డాక్టర్ ఎం.జానకిరామయ్య ఆశాభావం వ్యక్తం చేశారు.

ఈ సందర్భంగా తనకు ఢిల్లీలో అంతర్జాతీయ సదస్సుకు హాజరుకావడానికి సహకారం అందించిన కెఎల్ యు చైర్మన్ కోనేరు సత్యనారాయణకి ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా జానకి రామయ్యను వర్శిటీ వైస్ చాన్సులర్ డాక్టర్ జి.పార్ధసారధివర్మ, ప్రో చాన్సలర్ డాక్టర్ కెఎస్.జగన్నాథరావు, ప్రో వైస్ చాన్సలర్లు డాక్టర్ ఎవిఎస్.ప్రసాద్, డాక్టర్ ఎన్.వెంకట్ రామ్, డాక్టర్ కుర్రా రాజశేఖర్, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు, బయో టెక్నాలజీ విభాగాధిపతి డాక్టర్ కె.శ్రీనివాసులు అభినందించారు.

చలపతి ఫార్మసి కళాశాలలో 2న తెలుగు స్టేట్ ఓపెన్ చెస్ టోర్న మెంట్

ప్రజాశక్తి-తాడికొండ

చలపతి ఫార్మశీ కళాశాల వేదికగా ఆంధ్రప్రదేశ్ చెస్- అసోసియేషన్ (ఎపిసిఎ),ఆనంద్ చెస్ వింగ్స్ గుంటూరు (యన్ఎసిడబ్ల్యు) సంయుక్తంగా కలిసి జూన్ 2 న తెలుగు స్టేట్స్ ఓపెన్ చెస్ టోర్నమెంట్ పోటీలను నిర్వహించ నున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ప్రో నాదెండ్ల రామారావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు వాల్‌పోస్టర్లను ఆనంద్ చెస్ వింగ్స్ డైరెక్టర్ ఎమ్. గోపీనాథ్ విడుదల చేశారు. ఈ టోర్నమెంట్‌లో 8 రౌండ్స్ నిర్వహిస్తా రని, రూ.1,10,000 నగదు బహుమతులను ఆరోజున విజేతలకు అందజేస్తారని తెలిపారు,. ఈ ఓపెన్ కేటగిరి టోర్నమెంట్ లో అండర్ -7, 9, 11, 13, 15 వయస్సు గల బాలబాలికలు పాల్గొనవచ్చని, విజేతలకు నగదు బహు మతితో పాటు ట్రోఫీ అందజేయనున్నట్లు వివరించారు. జనరల్ కేటగిరిలో మొదటి 20 మంది విజేతలకు నగదు, బెస్ట్ వెటరన్, బెస్ట్ ఉమన్, బెస్ట్ గుంటూరు, బెస్ట్ పి.హెచ్ బహుమతులను అందజేస్తారని తెలిపారు.ఈ టోర్నమెంట్లో పాల్గొనేవారు రూ. 1.000 రిజిస్ట్రేషన్ ఫీజును చెల్లించి తమ పేరు నమోదు చేసుకోవాలని వివరించారు.



'తెలుగు స్టేట్ ఓపెన్ చెస్ టోర్న మెంట్' వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న చిత్రం

అబ్బురపరిచిన జానపదులు

(మొదటి పేజీ తరువాయి)

ఉపాధ్యాయులకు సేవా పురస్కారాలు ప్రదానం చేశారు. రచయిత చింతల యాదగిరి, సినీ నటులు కృష్ణేశ్వరరావు, బుర్రకథకులు బాపూజీ, గాయకులు పి.వి. రమణ, రాజేష్, అలాగే 25 మంది ఉపాధ్యాయులకు సేవా పురస్కారాలను అందచేశారు. సభలో జనచైతన్య వేదిక అధ్యక్షులు వి.లక్ష్మణరెడ్డి, పాటిబండ్ల విష్ణు, కాకుమాను నాగేశ్వరరావు, దాసరి రమేష్, దాసరి సుబ్బారావు, సరిమళ్ల చౌదరి, షేక్.బాష పాల్గొన్నారు.

ఆకట్టుకున్న కళా ప్రదర్శనలు

సూర్యాపేటకు చెందిన సంధ్య బృందం ప్రదర్శించిన కోలాటం, మట్టికే మాటలొస్తే పలికేది పాట అంటూ ఆలపించిన గేయం సభను హెూరెత్తించింది. భద్రాచలం, చింతూరుకు చెందిన అడవి బిడ్డలు కొమ్ముబుర్రలు, శ్రీకాకుళం జిల్లాకు చెందిన కళాకారులు హిమసుదన్ సారధ్యంలో తప్పెటగూళ్ల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. చింతల తామిని చిన్న వయస్సులో ఆలపించి అలరించింది.

బుర్ర కథ పితామహుడు నాజర్ కుమారుడు బాపూజీ బృందం బుర్రకథ ప్రదర్శించారు.చల్లపల్లికి చెందిన శ్రీనివాసులు బృందం డబ్బుల ప్రదర్శన ఉర్రూతలూగించింది. అదే విధంగా ప్రముఖ రచయిత చింతల యాదగిరి తాను రచించిన నా చిట్టి చేతులు చక్కని రాతలు నేర్వలేదయ్యో పాటను ఆలపించి కంటతడి పెట్టించారు. గాయకులు నల్గొండకు చెందిన వెంకటరెడ్డి, గుంటూరుకు చెందిన పి.వి.రమణ, లెనీనా, విజయవాడకు చెందిన రంగం రాజేష్ తెలుగు భాషకు సంబంధించిన వివిధ గేయాలు ఆలపించారు.





పల్నాడులో అప్రకటిత కర్ఫ్యూ!

(మొదటి పేజీ తరువాయి)

రోజున గ్రామాల్లో ఉన్న పరిస్థితిని, ఇప్పటికీ మార్పు ఉంది. ఇప్పటికే పలు కేసుల్లో నిందితులుగా ఉన్న వారంతా జైలు పాలయ్యారు. గుంటూరు, నర్సరావుపేట, గురజాల సబ్‌జైళ్ల నిందితులతో కిక్కిరిసిపోతున్నాయి. ఆయా ప్రాంతాల్లో అధికారపార్టీలో కీలకమైన వారంతా జైలులో ఉండగా లెక్కింపునకు మూడ్రోజుల ముందే హడావుడి చేయడం వల్ల ఏ రోజుకారోజు కూలి పని చేసుకుని పొట్టపోసుకునే వారికి తీవ్ర ఇబ్బందులు రానున్నాయి. ముందస్తు చర్యలు అవసరమే కానీ ఘర్షణలు జరిగే తేదీని గుర్తించి చర్యలు తీసుకుంటే బాగుంటుందనే వాదన ప్రజల నుంచి విన్పిస్తోంది.

రాష్ట్రమంతా మనవైపు చూస్తోంది..

(మొదటి పేజీ తరువాయి)

తెలిపారు. ఎన్నికల ఫలితాలపై చర్చకు వెళ్లి అల్లర్లు గొడవలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. పల్నాడులో శాంతిభద్రతలు కాపాడేందుకు పోలీస్ ఛాలెంజ్గా తీసుకుందని ప్రజలు పోలీస్ కు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ రాజశేఖర్, రాఘవేంద్రరావు, నరసరావుపేట డీఎస్పీ సుధాకర్, ఎస్బి సీఐ బండారు సురేష్, వినుకొండ టౌన్, రూరల్ సిఐలు సాంబశివరావు, సుధాకర్ పాల్గొన్నారు.

ఓట్ల లెక్కింపునకు సర్వం సిద్ధం

(మొదటి పేజీ తరువాయి)

మాచర్ల ప్రాంతంలో కౌంటింగ్ రోజున హైవే పక్కన ఉండే గ్రామాల్లో దుకాణాల బంద్ ఉంటుందన్నారు. నియోజకవర్గంలో శాంతి భద్రతలపై డిఎస్‌పి, ఆయా పోలీసుస్టేషన్స్ ఎస్‌హెచ్‌ఓలకు తగిన ఆదేశాలిచ్చామని, నైట్ పెట్రోలింగ్‌ను పటిష్టంగా చేయాలని చెప్పామని తెలిపారు. ప్రతి వార్డు, గ్రామంలో కార్డన్ సెర్చ్ కొనసాగుతుందన్నారు. బైండవర్ కేసులలో నిబంధనలు ఉల్లఘించిన వారికి వ్యక్తిగతంగా, కుటుంబ సభ్యులకు, గోడల మీద అంటించటం లాంటి ప్రక్రియ ద్వారా నోటీసులు అందజేసినట్లు తెలిపారు. నేటితో వారికి ఇచ్చిన గడువు ముగిసిందన్నారు. వారందరిని ఇక జైలుకు పంపేందుకు తహశీల్దార్స్ చట్టపరిధిలో వారిపై చర్యలు తీసుకుంటారని వివరించారు. పింఛను లబ్ధిదార్లకు 1వ తేది నుండి 3వ తేదిలోపు పంపిణి చేసేందుకు కమీషనర్, ఎంపిడిఓలకు ఆదేశాలిచ్చామన్నారు. 70శాతం మందికి బ్యాంక్‌లలో, 30 శాతం మందికి ఇళ్ళ వద్ద పంపిణీ ఉంటుందన్నారు. ఇవిఎంల ధ్వంసంకు సంబంధించి 4 కేసులు నమోదు చేసి 75 మంది నిందితులుగా గుర్తించామని, వారిలో 23 మందిని ఆరెస్టు చేశామని తెలిపారు. పోలింగ్‌కు ముందర 105 మందిపై 15 కేసులు నమోదు చేశామని, వారిలో 54 మందిని ఆరెస్టు చేసినట్లు తెలిపారు. పోలింగ్ రోజున 293 మందిపై 22 కేసులు నమోదు కాగ, వారిలో 150 మందిని ఆరెస్టు చేసినట్లు తెలిపారు. పోలింగ్ తరువాత 95 మందిపై 4 కేసులు నమోదు చేసి, 33మందిని ఆరెస్టు చేసినట్లు వివరించారు. ఆరెస్టు కాని వారి కోసం గాలింపు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఇదిలా ఉండగా మండల పరిధిలోని రాయవరంలో జరిగిన పోలీసు కవాత్‌లో జెసి పాల్గొని గ్రామస్తులకు జాగ్రత్తలు చెప్పారు.

విజయోత్సవాలకు అనుమతులు లేవు : డిఎస్‌పి

ప్రజాశక్తి - రెంటచింతల

ఎన్నికల ఫలితాలు పురస్కరించుకొని గ్రామాల్లో విజయోత్సవ సంబరాలు నిర్వహించేందుకు అనుమతులు లేవని గురజాల డీఎస్పీ సిహెచ్ శ్రీనివాసరావు స్పష్టం చేశారు. రెంటచింతలలో గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. ఎన్నికల ఫలితాలు రోజు గానీ ఆ తర్వాత గాని గ్రామాల్లో సంబరాలు చేసుకునేందుకు, బాణాసంచా కాల్చేందుకు అనుమతులు లేవన్నారు. నిబంధనలు అతిక్రమించి వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పొగాకు ఉత్పత్తులు ప్రాణాంతకం..

- పొగ పీల్చడం రోగాలకు కారణం
- తోటి వారికి అనారోగ్యం
- పెరుగుతున్న పొగాకు వాడకం
- నేడు అంతర్జాతీయ పొగాకు వ్యతిరేక దినోత్సవం

ఎటువంటి అలవాట్లు లేని వ్యక్తి పలు రకాల అలవాట్లు ఉన్న వారితో సహవాసం చేసినా అలవాట్లకు బానిసలయిన వారిని చూసినా సరదాగా మనం కూడా ఇలా చేద్దాం అనుకునే వారు ఉంటారు. కొన్నాళ్ళు సావాసం చేస్తే వీళ్ళు వాళ్ళు వాళ్ళు వీళ్ళు అవుతారన్న సామెత ఉండనే ఉంది.పొగ త్రాగడం,ఖైని గుట్కా నమలడం మొదట సరదాగా మొదలై తర్వాత బానిసలై కాస ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు. గుట్కా, పాన్, జర్దా, పాన్ పరాక్, తంబాకు, ఖనీ తదితర పొగాకు ఉత్పత్తుల వాడకం క్యాన్సర్ కు దారితీస్తోంది. పొగ తాగడం, పొగాకు మిళిత పదార్థాలు నమలడం నేడు ఒక ఫ్యాషన్ గా మారింది. చిన్న, పెద్ద అనే తేడా లేకుండా ఆయా వ్యసనాలకు బానిసలై అనారోగ్యానికి గురవు తున్నారు.

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

పొగాకు వివిధ రూపాల్లో విని యోగించడం రోజురోజుకు పెరిగి పోయింది. పొగాకు ఉత్పత్తుల వినియోగం వలన కలిగే అనర్ధాల పట్ల ప్రజల్లో చైతన్యం నింపేందుకు ప్రభుత్వం చేస్తున్న ప్రచారం కూడా అంతంత మాత్రంగా ఉంది. పొగాకు వాడకంతో గుండె జబ్బులు, క్యాన్సర్లు, ఊపిరితిత్తుల వ్యాధు లు, కిడ్నీ సమస్యలు తదితర ప్రాణాంతక వ్యాధులతో బాధపడుతున్నారు. పొగాకు వినియోగంతో విలువైన ప్రాణాలు కోల్పో తున్నారు. పొగాకు ఉత్పత్తులతో వాటిల్లు





తున్న అనర్ధాలపై ప్రపంచ ఆరోగ్య సంస్థ నివేదిక పలు హెచ్చరికలు చేసి ప్రతి మే 31 వరల్డ్ యాంటీ టొబాకో డేగా ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రకటించడంతో 1987 నుంచి ప్రపంచ పొగాకు వ్యతిరేక దినంగా పాటిస్తున్నారు. 20వ శతాబ్దంలో 100 మిలియన్ మరణాలు కేవలం పొగాకు ఉత్పత్తులతో జరుగుతున్నాయని ప్రపంచ ఆరోగ్య సంస్థ వెల్లడించారు. సిగరెట్ తాగే వారి కన్నా పక్కన ఉండి పీల్చేవారికి ఎక్కువ జబ్బులు వచ్చే ప్రమాదం పొంచి ఉందని ఆరోగ్య నిపుణులు హెచ్చరిస్తు న్నారు.

కేంద్ర ప్రభుత్వం సిగరెట్లు ఇతర పొగాకు ఉత్పత్తులపై చట్టంలో కీలకమైన మార్పులు తీసుకువచ్చింది. ఈ చట్టం ప్రకా రం బహిరంగ ప్రదేశాల్లో పొగాకు ఇతర పొగాకు ఉత్పత్తులను వినియోగంపై వ్యక్తు లకు తగు జరిమానా విధించవచ్చు. ఈ జరిమానా విధించే అధికారం పోలీసులకు, ఆహార, డ్రగ్స్ కంట్రోల్ అధికారులకు ఇచ్చింది. ఈ చట్టం ప్రకారం బస్టాండ్లు రైల్వే స్టేషన్ ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు బహిరంగ ప్రదేశాలలో పొగ సేవిస్తే నేరం కింద పరిగణించేవారు. 2008లో చట్టాన్ని సవరించారు.

యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి



డాక్టర్ బొల్లు సాయిరాం
సాయి నిహారిక నర్సింగ్ హోం, నరసరావుపేట

పొగ తాగడం పొగాకు మిళిత మత్తు పదార్థాలు నమలడం బాగా పెరిగి పోయింది. ఫలితంగా గతంలో 60,70 ఏళ్ల వయసు వారికి సోకే కేన్సర్ 30,35 ఏళ్లకే సోకు తున్నట్లు నివేదికలు చెబుతున్నాయి. పొగాకు, బీడీ, సిగరెట్, పొగాకు మిళిత పదార్థాలు నమలడం ద్వారా ఊపిరి తిత్తుల వ్యాధులు ఊపిరితిత్తుల క్యాన్సర్ ఇతర అనారోగ్య సమస్యలు తలెత్తు తున్నాయి. తలనొప్పి, తల తిరగడం, నిద్రలేమి, నోరు, గొంతు, అల్సర్, పుండ్లు, కడుపులో మంట జీర్ణాశయ క్యాన్సర్, గర్భాశయ క్యాన్సర్, మూత్రాశయానికి సంబంధించిన సమస్యలు వస్తాయి. పొగాకులో ఉండే నికోటిన్ శరీరంలో కీలక పాత్ర పోషించే డోపమైన్ (న్యూరో ట్రాన్స్మిటర్) ద్వారా క్షణాల్లోనే మెదడుకు చేరడం కర్బన రసాయనం విడుదల కావడం తద్వారా అవి లేకుండా గడపలేని స్థితికి చేరుకుంటారు.పొగాకులో ఉండే నికోటిన్ 4 వేల రకాల విష కార కాలు 43 రకాల క్యాన్సర్ కారకాలు శరీ రంలో ప్రవే శిస్తాయి. ఆయా అలవాట్లతో పాటు దుమ్ము ధూళితో వలన త్వరితగతిన అనారోగ్యానికి గురవుతున్నారు. యువత మత్తు పదార్థాలకు బానిసలై విలువైన జీవితాన్ని పాడు చేసుకోవద్దు.

వివాహేతర సంబంధమని అనుమానం

అనుమానితుడిపై భర్త దాడి

- చికిత్స పొందుతూ మృతి
- పేరేచర్లలో ఘటన

ప్రజాశక్తి - మేడికొండూరు

తన భార్యతో వివాహేతర సం బంధం కలిగి ఉన్నాడని అనుమానంతో అనుమానితుడిపై భర్త దాడి చేసి గాయ పరచగా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బాధితుడు మృతి చెందాడు. ఈ సంఘటన మండలంలోని పేరేచర్ల పలకలూరు రోడ్ లో గురువారం జరిగింది. గుంటూరు రూరల్ మండలం పెద్దపలకలూరుకి చెందిన తోట బాలకృష్ణ అనే వ్యక్తి తన భార్యతో అదే గ్రామానికి చెందిన షేక్ రషీద్‌తో వివాహేతర సంబంధం కలిగి ఉన్నాడని అనుమానంతో అతనిపై కోపం పెంచుకున్నాడు. గురువారం బాలకృష్ణ తన కారులో పేరేచర్లకు వచ్చాడు. తిరిగి వెళ్లే క్రమంలో పలకలూరు రోడ్డులోని పెట్రోల్ బంకు సమీపంలో ఎదురుగా ద్విచక్ర వాహనంపై రషీద్, స్నేహితుడు రసూల్ వస్తున్నారు. వారిని గమనించిన బాలకృష్ణ తన కారు వేగం పెంచి వారి వాహనాన్ని బలంగా ఢీ కొట్టాడు. ఈ ఘటనలో ద్విచక్ర వాహనంపై నుంచి వారిద్దరూ కింద పడిపోయారు. కారు దిగి బయటకు వచ్చి న బాలకృష్ణ, కింద పడి ఉన్న రషీద్‌పై తీవ్రంగా దాడి చేసి గాయపరిచాడు. రసూలు అడ్డుకున్నాడు. అప్పటికే తీవ్ర గాయాల పాలై , అధిక రక్తస్రావం జరిగి రషీద్ అపస్మార స్థితిలోకి వెళ్లిపోయాడు. రషీద్‌ను రసూల్ వేరే వాహనంలో గుంటూరు ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ రషీద్ (35) మృతి చెందాడు. మేడికొండూరు పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. వివాహేతర సంబంధం నేపథ్యంలోనే ఈ సంఘటన జరిగిందని పోలీసులు తెలిపారు.



మృతుడు రషీద్

మైనర్లూ.. జాగ్రత్త

ప్రజాశక్తి-తాడేపల్లి



ప్రస్తుత స్పీడ్ యుగం లో మైనర్లు రోడ్ల మీద రయ్ మంటూ దూసుకెళ్ళ న్నారు. రోడ్డు మీద వం పులు తిరు గుతూ ర్యాష్ డ్రైవింగ్ చేస్తూ ప్రమాదాలకు గురవు తున్నారు. వారు ప్రమాదానికి గురవ్వడమే కాకుండా ఎదుటి వారిని ప్రమాదానికి గురి చేస్తున్నారు. ఒక బైకు మీద ముగ్గురు నుంచి నలుగురు వ్యక్తులు ఎక్కి సవారీ చేస్తున్నారు. ఈ విధమైన డ్రైవింగ్‌కు రేపటి నుంచి కొత్త నిబంధనలు అమల్లోకి రానున్నాయి. భారీగా జరి మానాలు విధిం చడానికి రవాణ శాఖ కసరత్తు చేస్తుంది. ఆరు నెలల కిందే వడ్డింపులకు సిద్ధం చేసిన రవాణ శాఖ ఎన్నికల సందర్భంగా వాయిదా వేసింది. జూన్ ఒకటో తేదీ నుంచి కొత్తగా ట్రాఫిక్ నిబంధనలు అమల్లోకి రాను న్నాయి. తల్లిదండ్రులు కూడా ముద్దు ముచ్చట పేరుతో పిల్లలకు బైక్‌లు ఇవ్వవద్దని హెచ్చరిస్తున్నారు. అతివేగంతో వాహనాలు నడుపుతూ పట్టుబడితే వెయ్యి నుంచి రెండు వేల రూపాయల వరకు జరిమానా కట్టాల్సి ఉంటుంది. లైసెన్స్ లేకుండా వాహనం నడిపితే రూ.500 జరిమానా విధించడానికి నిబంధనలు రూపొందించారు. ఇవన్నీ మేజర్లకు మాత్రమే. ఇక మైనర్లు వాహనం నడిపితే రూ.25 వేలు జరిమానా విధించడానికి రంగం సిద్ధం చేశారు. ఫెనాల్టీతో పాటు వాహనం నడిపిన మైనర్‌కు 25 ఏళ్ల వయసు వచ్చే వరకు డ్రైవింగ్ లైసెన్సు పొంద కుండా ఆంక్షలు విధించనున్నారు. మైనర్లకు వాహనాలు ఇవ్వకుండా పెద్దలు జాగ్రత్త పడాల్సిన అవసరముంది.

యువకుడి పై పోక్సో కేసు

ప్రజాశక్తి - తాడికొండ

యువకుడిపై ఫోక్సో కేసు నమోదైన ఘటన ఆల స్యంగా వెలుగులోకి వచ్చింది. తాడికొండ సిఐ సిహెచ్ ప్రభాకర్ రావు వివరాల ప్రకారం మండలంలోని లామ్ గ్రామానికి చెందిన రాయపూడి గురవయ్య బిఎస్సి వరకు చదువుకొని ఇంటి వద్దనే ఉంటున్నాడు. ఈనెల 20వ తేదీన ఇదే గ్రామానికి చెందిన దాసరి దీప్తి మనోజ ఆమె తోడికోడలు కుమార్తె ఇంటి వద్ద ఆడుకుంటుండగా గుర వయ్య వారిని ఇంటిలోపలకు తీసుకొని వెళ్లి ముగ్గురు బాలికలను తాకుతూ అసభ్యంగా ప్రవర్తించాడు. భయ ం భ్రాంతులకు గురైన బాలికలు ఈ విషయాన్నీ కుటుంబ సభ్యులకు తెలిపారు. ఈ మేరకు మనోజ బుధవారం ఫిర్యాదు చేయగా గురవయ్య ను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేశారు. నింది తుడిని గురువారం కోర్టులో హాజరు పరిచినట్లు సిఐ తెలిపారు.

హత్య కేసుల్లో నిందితుల అరెస్టు

ప్రజాశక్తి -కారంపూడి



మండలంలో జరిగిన రెండు హత్య కేసులలో నిందితులను స్థానిక పోలీసులు ఎంతో చాకచక్యంగా వ్యవహరించి నింది తులను అతి తక్కువ సమయంలోనే అరెస్టు చేశారు. ఈనెల 25వ తేదీన మండలంలోని మిర్యాల గ్రామంలో భార్యాభర్తల గొడవ విషయంలో అడ్డు వెళ్లిన అమ్మమ్మను జక్కుల. నాగరాజు అనే అతను రోకలి బండ తో కొట్టటంతో రాములమ్మ అనే వద్ధురాలు అక్కడికక్కడే మృతి చెందింది.నిందితుడు మిర్యాల వెళ్లే దారిలో ఉండగా ఎస్ ఐ అమీర్, సిబ్బంది గురువారం అరెస్టు చేశారు. అలాగే, మం డలం లోని పెదకూదమగుండ్ల గ్రామంలో చికెన్ షాప్ నిర్వహిస్తున్న నన్నే సాహెబ్ అనే అతనిని అతని షాపులోనే పని చేస్తున్న షేక్. జానీ అనే అతను గురువారం తెల్లవారుజామున చికెన్ షాప్ లోని కత్తి తో గొంతు కోసి అతి కిరాతకంగా హత్య చేశాడు. హత్య సమయం లో నిందితుడు మద్యం సేవించి వున్నాడని పోలీసులు తెలిపారు. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు ఉన్నతాధికారుల ఆదేశాలతో 24 గంటల లోపే నిందితులను వెంటనే అరెస్టు చేసినట్లు గురువారం స్థానిక పోలీస్ స్టేషన్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశం లో స్థానిక సిఐ తెలిపారు.



దుకాణంలో విత్తన నిల్వలు పరిశీలిస్తున్న వ్యవసాయ శాఖ అధికారులు

నకలీ విత్తనాలు విక్రయిస్తే లైసెన్స్ రద్దు

- దుకాణాల్లో, రవాణా కార్యాలయాల్లో తనిఖీలు
- వ్యవసాయ శాఖ అనుమతి పొందిన రసీదులు తప్పనిసరి

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

విత్తన, ఎరువుల అధీకృత డీలర్లు తమ దుకాణాలలో రైతులకు తని ఖీలకు వచ్చిన అధికారులకు కనిపించేలా ధరల పట్టిక, ఎరువులు, విత్తనాలు నిల్వలకు సంబంధించి సూచిక బోర్డులో తప్పనిసరిగా నమోదు చేయాలని వ్యవసాయ శాఖ ఎడిఎ పి.మస్తానమ్మ సూచిం చారు. ప్రస్తుత ఖరీఫ్ సాగుకు రైతులు సన్నద్ధం అవుతున్న నేపథ్యంలో కొద్ది రోజుల నుండి ఎప్పటికప్పుడు వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో విత్తన ఎరువుల దుకాణాలపై తనిఖీలు చేస్తున్నామన్నారు. పట్టణంలో పలు విత్తనాలు, ఎరువుల దుకాణాలను నరస రావుపేట మండల వ్యవసాయ శాఖ అధికారి వి.నరేంద్రబాబుతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా షాపులో ఉన్న విత్తనాలు, ఎరువుల నిల్వలను పరిశీలించారు. ఈపాస్ ద్వారానే కొనుగోలు అమ్మకాలు జరపాలని సూచించారు. నకిలీ విత్తనాలు ఎరువులను అమ్మి రైతులను మోసగిస్తే లైసెన్స్ రద్దుతో పాటు చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. అధిక ధరలకు విక్రయించినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. రైతులు కొనుగోలు చేసిన విత్తనాలు, ఎరువులకు రసీదులు తప్పనిసరిగా ఇవ్వాలని షాపుల నిర్వాహకులకు సూచించారు. రైతులు కూడా విధిగా తాము కొనుగోలు చేసిన విత్తనాలు ఎరువులు, పురుగు మందు లకు రసీదులు తప్పనిసరిగా తీసుకోవాలని ఆమె పేర్కొన్నారు.



ఘనంగా సిఐటియు ఆవిర్భావ దినోత్సవం

ప్రజాశక్తి-సత్తెనపల్లి : సిఐటియు 54వ ఆవిర్భావ దినోత్సవాలు పట్టణంలో గురువారం ఘనంగా జరిగాయి. స్థానిక పాత బస్టాండ్‌లోని సంఘ కార్యాలయం వద్ద జెండాను ఎలక్ట్రిసిటీ వర్కర్స్ యూనియన్ మాజీ నాయకులు డి.వెంకటేశ్వర్లు ఆవిష్కరించారు. సిఐటియు పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.ఆంజనేయులు నాయక్ మాట్లాడుతూ కార్మికవర్గ రాజ్య స్థాపనే లక్ష్యంగా 1970లో ఆవిర్భవించిన సిఐటియు నాటినుండి కార్మికులందర్నీ ఐక్యం చేసి వర్గ పోరాటాలను నిర్వహిస్తోందని అన్నారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గుంటూరు విజయకుమార్, పట్టణ కార్యదర్శ ఎం.హరిపోతురాజు, నాయకులు జి.మల్లేశ్వరి, జి.సుసులోవ్, ఎం.యోగయ్య, కె.శివదుర్గారావు, జి.మస్తాన్‌రావు, జె.రాజ్‌కుమార్ పాల్గొన్నారు.



ప్రజాశక్తి - మాచర్ల : ఉద్యోగ, శ్రామిక, రైతు, కౌలురైతు తదితరుల సమస్యలపై సిఐటియు నిరంతరం పోరాడుతోందని నాయకులు బి.మహేష్ అన్నారు. స్థానిక సిఐటియు కార్యాలయం వద్ద జెండాను నాయకులు వై.సురేష్ ఆవిష్కరించారు. మహేష్ మాట్లాడుతూ ఐక్య ఉద్యమాల ద్వారానే సమస్యలు పరిష్కారం ఆవుతాయన్నారు. వెంకటరత్నం, వి.వెంకటరావు, శోభన్‌కుమార్, బత్తుల మహేష్ పాల్గొన్నారు.

సరదాగా నైపుణ్యాలు నేర్పే సమ్మర్ క్యాంప్‌లు

ప్రజాశక్తి - యడ్లపాడు : యడ్లపాడు అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సమ్మర్ క్యాంప్ గురువారం ముగిసింది. ఈ సందర్భంగా గణిత ఉపాధ్యాయులు కల్లూరు వాసు అధ్యక్షతన సభ నిర్వహించగా ఆయన మాట్లాడుతూ 30 రోజులపాటు నిర్వహించిన శిబిరంలో విద్యార్థులకు నేర్పిన అంశాలపై వివరించారు. ముఖ్యఅతిథిగా హాజరైన పిఆర్ విజ్ఞాన కేంద్రం సభ్యులు ముత్తవరపు రామారావు మాట్లాడుతూ విద్యార్థులంతా ఒకచోటకు చేరి సరదాగా గడపడానికి, నైపుణ్యాలు పెంచుకోవడానికి, సామాజిక అంశాలు తెలుసుకోవడానికి సమ్మర్ క్యాంప్ ఉపయోగపడుతుందని చెప్పారు. ఈ సందర్భంగా రూ.50 వేల విరాళాన్ని రామారావు, డాక్టర్ ముత్తవరపు సురేష్‌బాబు యడ్లపాడు అభివృద్ధి కమిటీకి అందించారు. మలినేని ఇంజనీరింగ్ కాలేజీ డీన్ డాక్టర్ పోపూరి రమేష్‌బాబు మాట్లాడుతూ లక్ష్యం, ఏకాగ్రత, కష్టపడేతత్వాన్ని విద్యార్థులు అలవర్చుకోవాలని, వీటిద్వారా ఉన్నత స్థాయికి ఎదగొచ్చని చెప్పారు. కార్యక్రమంలో నారాయణ స్కూల్ ప్రిన్సిపాల్ చెరుకూరి సృజన, షేక్ జున్ను మాస్టారు, హెచ్‌ఎం కె.వి.రామిరెడ్డి, మాజీ ప్రిన్సిపల్ కె.నాగేశ్వరరావు, పి.వెంకటేశ్వర్లు (చిన్న), పి.అనంతలక్ష్మి, కె.రాంబ్రహం, కె.నాగమల్లేశ్వరరావు, ఎన్.వెంకటేశ్వర్లు, మీరావలి, రమాదేవి, ఉపాధ్యాయులు లక్ష్మీనారాయణ, రామకృష్ణ పాల్గొన్నారు.





సత్తెనపల్లిలో నివాళులర్పిస్తున్న నాయకులు




గుంటూరు సిపిఎం జిల్లా కార్యాలయంలో నివాళులర్పిస్తున్న నాయకులు



నకరికల్లు మండలం చేజర్లలో

అలుపెరుగని పోరాట యోధుడు వెంకటపతి

వర్ధంతి సందర్భంగా పల్నాడు, గుంటూరు జిల్లాల్లో ఘన నివాళులు



పిడుగురాళ్ల

ప్రజాశక్తి-సత్తెనపల్లి

ఉద్యమ నాయకునిగా రైతు, ప్రజల సమస్యలపైన అలుపెరుగని పోరాటాలు చేసి.. ప్రజాప్రతినిధిగా సత్తెనపల్లి ప్రాంత అభివృద్ధికి ప్రజల సమస్యల పరిష్కారానికి పాటుపడిన పుతుంబాక వెంకటపతి ఆశయాలను కొనసాగిద్దామని సిపిఎం రాష్ట్ర కమిటీ మాజీ సభ్యులు గద్దె చలమయ్య అన్నారు. సిపిఎం సత్తెనపల్లి మాజీ ఎమ్మెల్యే, సిపిఎం నేత, రైతు ఉద్యమ నాయకులు పుతుంబాక వెంకటపతి 31 వర్ధంతి సభ ఉమ్మడి గుంటూరు జిల్లాలోని పలుచోట్ల గురువారం నిర్వహించారు. ఆయన చిత్రపటాలకు పూలమాలలేసి నివాళులర్పించారు. ఇందులో భాగంగా సత్తెనపల్లిలోని పుతుంబాక వెంకటపతి స్తూపానికి సిపిఎం పల్నాడు జిల్లా కార్యదర్శి గుంటూరు విజయ్‌కుమార్ పూలమాలలేశారు. అనంతరం స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో డి.అమూల్య అధ్యక్షతన వర్ధంతి సభ నిర్వహించగా వెంకటపతి చిత్రపటానికి సీనియర్ నాయకులు జి.వేమయ్య పూలమాలలేశారు. ఈ సందర్భంగా గద్దె చలమయ్య మాట్లాడుతూ మోడీ ఓటమితోనే భారత ప్రజాస్వామ్యానికి మనుగడ ఉంటుందన్నారు. ఎన్నికల్లో ఓట్ల కోసం ప్రజల మధ్య మత విద్వేషాలు రగిలించేలా మోడీ మాట్లాడారని, బిజెపి పాలనలో ప్రజల జీవన స్థితిగతులు దారుణంగా తయారైన విషయాన్ని కప్పిపుచ్చే ప్రయత్నం చేశారని విమర్శించారు. ప్రజా సమస్యలపైన, దేశాభివృద్ధి, రైతులకు, మహిళలకు, ఇతర రంగాల్లో అభ్యున్నతికి ఇండియా వేదిక ఇచ్చిన హామీలు మీడియాలో ప్రచారం కాకుండా బిజెపి అడ్డుకుందని అన్నారు. కాంగ్రెస్ పార్టీ బ్యాంకు ఖాతాలను నిలిపేయడం పారదర్శక ఎన్నికల విధానానికి విఘాతమని చెప్పారు. ఎలక్టోరల్ బాండ్ల ద్వారా మోడీ భారీ అవినీతికి పాల్పడ్డారని, ఈ ఎన్నికల్లో మోడీ, బిజెపికి ఓటమి తప్పదని అన్నారు. ముస్లిములపై మోడీ విద్వేష వ్యాఖలు చేసినా రాష్ట్రంలోని వైసిపి, టిడిపి, జనసేనలు మౌనంగా ఉన్నాయన్నారు. సభలో ప్రముఖ న్యాయవాది పిన్నమనేని పాములయ్య, సిపిఎం పల్నాడు జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎస్.ఆంజనేయులునాయక్, నాయకులు జి.బాలకృష్ణ, కె.శివదుర్గారావు, జి.మల్లేశ్వరి, జి.రజని, పి.మహేష్, జి.ఉమశ్రీ, పి.సూర్యప్రకాశరావు, జె.రాజకుమార్, డి.మేరమ్మ, ఎం.నరసింహారావు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - గుంటూరు

గుంటూరులోని సిపిఎం జిల్లా కార్యాలయంలో వెంకటపతి చిత్రపటానికి సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వై.నేతాజి పూలమాల వేసి నివాళు లర్పించారు. జిల్లా కార్యదర్శి పాశం రామారావు మాట్లాడుతూ సిపిఎం ఉమ్మడి గుంటూరు జిల్లా కార్యదర్శిగా, ఫిరంగిపురం సమితి అధ్యక్షునిగా, సత్తెనపల్లి ఎమ్మెల్యేగా ఆ ప్రాంత అభివద్ధికి ఎంతో కృషి చేశారన్నారు. గ్రామాలకు రోడ్లు, పాఠశాల భవనాలు, మౌళిక వసతుల కల్పనకు పాటుపడ్డారని గుర్తు చేశారు. రైతు సమస్యలపై నిరంతరం ఆందోళన చేసేవారన్నారు. కమ్యూనిస్టు ఉద్యమంలో వచ్చిన అతివాద, మితవాద విచ్ఛిన్నకర



తెనాలి



ముప్పాళ్ల మండలంలో నివాళులర్పిస్తున్న నాయకులు

ఉద్యమాలకు వ్యతిరేకంగా పోరాడి సిపిఎం నిర్మాణానికి, అభివృద్ధికి కృషి చేశారని అన్నారు. ఆయన ఆశయాలను, లక్ష్యాలను కొనసాగించాలని శ్రేణులకు పిలుపునిచ్చారు. నేతాజి మాట్లాడుతూ జిల్లా పరిషత్ సమావేశాలలో, శాసన సభలోనూ ప్రజా సమస్యలను ప్రస్తావించి వాటి పరిష్కారానికి వెంకటపతి కృషి చేశారన్నారు. ప్రజా సమస్యలపై లోతైన అధ్యయనం చేసేవారన్నారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఇ.అప్పారావు, ఎన్.భావన్నారాయణ, నాయకులు బి.శ్రీనివాసరావు, ఎమ్.ఎ చిష్టీ, వై.కృష్ణకాంత్, సాంబశివరావు, శేఖర్‌రెడ్డి, ఖాశింషహీద్, బాషా, సమీర్ పాల్గొన్నారు.

ప్రజాశక్తి - పెదనందిపాడు

మండంలోని పాలపర్రులో వెంకటపతి గారి చిత్రపటానికి సిపిఎం సీనియర్ సభ్యులు నంబూరి తులసయ్య పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న జిల్లా కార్యదర్శి పాశం రామారావు మాట్లాడుతూ సిపిఎం అభ్యున్నతికి జీవితాంతం పాటుపడిన మహనీయుడు వెంకటపతి అని కొనియాడారు. సిపిఎం మండల కార్యదర్శి డి.రమేష్‌బాబు, సీనియర్ నాయకులు పి.సుబ్బారావు, జె.రామారావు, ఎం.వెంకటేశ్వర్లు, టి.ప్రతాపరెడ్డి, డి.శ్రీను, కె.వెంకటశివరావు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - నకరికల్లు

మండలంలోని చేజర్లలో వర్ధంతి సభ నిర్వహించగా సిపిఎం పల్నాడు జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వై.రాధాకృష్ణ మాట్లాడారు. మండల కార్యదర్శి జి.పిచ్చారావు, దుర్గాబాయి, ఇ.అప్పిరెడ్డి, వర్ది నాయక్, రామంజి నాయక్, బాలమ్మ బాయ్, సిహెచ్.కోటేశ్వరరావు, కొండానాయక్, వెంకటేశ్వర్లు, గోవిందా నాయక్, రమణ పాల్గొన్నారు.

ప్రజాశక్తి-పిడుగురాళ్ల

పట్టణంలోని కన్నెగంటి హనుమంతు భవనంలో సభ నిర్వహించారు. తొలుత వెంకటపతి చిత్రపటానికి సిపిఎం పల్నాడు జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఏపూరి గోపాలరావు పూలమాలవేసి నివాళులర్పించారు. సభకు సీనియర్ నాయకులు టి.సుబ్బయ్య అధ్యక్షత వహించారు. గోపాలరావు మాట్లాడుతూ పంటలకు మద్దతు ధర కోసం, సాగర్ ప్రాజెక్టు నిర్మాణం కోసం రైతుల్ని కూడగట్టి సత్తెనపల్లి తాలూకాలో 50 వేల మంది రైతులతో వెంకటపతి సభ నిర్వహించారని గుర్తు చేశారు. తెలంగాణ సాయుధ పోరాటానికి కార్యకర్తలను పంపి తాను ఎన్నో నిర్బంధాలను, జైలు జీవితాన్ని అనుభవించారని అన్నారు. కొల్లూరు, బోధనం అన్‌ఫారెస్ట్ భూములు కోసం ఎన్నో పోరాటాలు చేసి పేదలకు 500 ఎకరాల భూమిని పంపిణీ



తాడేపల్లి



గుండిమెడ

చేయడంలో కీలకంగా వ్యవహరించారన్నారు. నాయకులు టి.శ్రీనివాసరావు, డి.వెంకటేశ్వర్లు, డి.భూలక్ష్మి, హుస్సేన్, గోవిందు, రింకుబాయ్, మస్తాన్, కోటిరెడ్డి, వెంకటేశ్వరమ్మ పాల్గొన్నారు.

ప్రజాశక్తి-తెనాలిరూరల్

స్థానిక చెంచుపేట సిపిఎం కార్యాలయంలో వెంకటపతి చిత్రపటానికి సీనియర్ నాయకులు ఎం.శివసాంబిరెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. డివిజన్ కార్యదర్శి కొల్లిపర బాబుప్రసాద్ మాట్లాడుతూ ప్రాథమిక విద్య కూడా చదవని వెంకటపతి ఆంగ్ల దిన పత్రికను పటించగలిగేలా ఆ భాషను నేర్చుకున్నారని చెప్పారు. నాగార్జున సాగర్ కుడికాల్వ గండి పడినప్పుడల్లా ఆయన అక్కడ ప్రత్యక్షమయ్యేవారని చెప్పారు. గుంటూరు జిల్లాలో లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టులు ఆయన సూచించినవేనని చెప్పారు. షేక్ హుస్సేన్‌వలి, ఎన్.రాజ్యలక్ష్మి, ఈశ్వరి, ఆర్.శివకృష్ణ, శ్రీనివాసరావు, సాయి, జి.వెంకట సుబ్బయ్య, కె.శ్రీనివాసరావు, హసీనా, ఎం.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్

గుండిమెడలో వెంకటపతి చిత్రపటానికి సిపిఎం సీనియర్ నాయకులు బి.సంసోను పూలమాలవేసి నివాళు లర్పించారు. నాయకులు పి.కృష్ణ మాట్లాడారు. కె.సాంబశివరావు, కె.వెంకటయ్య, రత్తయ్య, దేవదాసు, దావీదు, శివయ్య, సీతయ్య, నాని, వెంకట్రావు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-తాడేపల్లి

స్థానిక మేకా అమరారెడ్డి భవన్‌లో వెంకటపత్తి చిత్రపటానికి సీనియర్ నాయకులు జొన్నా శివశంకరరావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. వి.దుర్గారావు మాట్లాడుతూ ఉవ్వెత్తున సాగిన తెలంగాణ పోరాటంలో ఆంధ్ర నుంచి పోరాటానికి అండదండలు అందించిన వారిలో సింహాద్రి శివారెడ్డితో పాటు పుతుంబాక ఒకరని అన్నారు. అచ్చంపేట పోలీస్‌స్టేషన్‌పై దాడి దగ్గర నుంచి పోరాట కాలంలో రహస్యంగా ఉండి ఉద్యమాన్ని కాపాడిన వారిలో ఆయన ఒకరని చెప్పారు. సిపిఎం పట్టణ కార్యదర్శి బి.వెంకటేశ్వర్లు, నాయకులు కె.కరుణాకరరావు, జి.సుబ్బారెడ్డి, ఎస్.ముత్యాలరావు, బి.దశరధరామిరెడ్డి, జి.శ్రీనివాసరావు, కె.స్టీవెన్, యెహోషువా, కె.శ్రీను పాల్గొన్నారు.

ప్రజాశక్తి-ముప్పాళ్ల

మండలంలోని నార్నెపాడు, మాదల సిపిఎం కార్యాలయాల్లో వర్ధంతి సభలు నిర్వహించారు. జి.బాలకృష్ణ, ఎన్.సాంబశివరావు, ఐ.శ్రీను, కె.ప్రభాకర్, కె.సాంబశివరావు, ఎం.వెంకటరెడ్డి, జి.జాలయ్య, పి.సైదాఖాన్, ఆర్.వెంకటేశ్వర్లు, కె.నాగేశ్వరరావు, ఐ.సత్యనారాయణరెడ్డి పాల్గొన్నారు.

ఉపాధి కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ఉపాధి హామీ పని ప్రదేశాలను పరిశీలించిన సిపిఎం, ప్రజాసంఘాల నాయకుల డిమాండ్

ప్రజాశక్తి -పెదనందిపాడు : జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో వందరోజుల పని దినాలు కల్పించాలని, రూ.300 కనీస వేతనం అమలు చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు డిమాండ్ చేశారు. గురువారం పెదనందిపాడు మండలం నాగులపాడు గ్రామంలో ఉపాధి హామీ కార్మికులను పనిచేస్తున్న ప్రదేశంలో కలిసి వారి తో మాట్లాడారు. ఆనాడు యూపీఏ 1 ప్రభుత్వం మీద ఒత్తిడి తీసుకువచ్చి సిపిఎం ఉపాధి హామీ చట్టాన్ని అమలులోకి తీసుకువచ్చిందని అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ పనులు లేనప్పుడు, వలసలను నివారించడానికి ఉన్న ప్రాంతంలోనే పనులు కల్పించే ఉద్దేశంతో ఈ చట్టాన్ని రూపొందించారని, గ్రామీణ పేదలకు ఉపాధి హామీ పథకం ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. కానీ నేడు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఉపాధి హామీ చట్టానికి తూట్లు పొడిచే విధంగా బడ్జెట్లో నిధుల కేటాయింపులను తగ్గించుకుంటూ వస్తుందన్నారు. ఈ ప్రయత్నాలను తిప్పి కొట్టాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. రెండు పూటలా పని విధానాన్ని రద్దు చేయాలని, పని ప్రాంతంలో వేసవి తీవ్రత దృష్ట్యా మజ్జిగ, మంచినీరు వంటివి అందుబాటులో ఉంచాలని, సమ్మర్ అలవెన్సులు ఇవ్వాలని కోరారు. ఏదైనా ప్రమాదం జరిగినప్పుడు పని ప్రదేశంలో మెడికల్ కిట్లు అవసరం ఉంటుందని అవి అందుబాటులో ఉంచాలన్నారు. ఉపాధి మేట్లకు అలవెన్స్ లు ఆపివేశారని, వాటిని తిరిగి అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం ఉపాధ్యక్షుడు భీమినేని రవికుమార్, రైతు సంఘం నాయకులు కొత్త వెంకట శివరావు కన్నెగంటి చంద్రా రావు, నల్లమోతు రాజేంద్ర తదితరులు పాల్గొన్నారు.

మెడికిల్ కిట్లు అందుబాటులో ఉంచాలి

ప్రజాశక్తి-తెనాలిరూరల్ :ప్రభుత్వ ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీలకు మెడికల్ కిట్లు అందుబాటులో ఉంచాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం గుంటూరు జిల్లా కార్యదర్శి ఈమని అప్పారావు, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు మలకా శివసాంబిరెడ్డి డిమాండ్ చేశారు. గురువారం తెనాలి మండలం తేలప్రోలులో ఉపాధి హామీ పనులు నిర్వహిస్తున్న పని ప్రదేశాలను పరిశీలించారు. అక్కడే పనులకు ఉపక్రమించిన కూలీల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కూలీలు తమ సమస్యలను నాయకుల దృష్టికి తీసుకువచ్చారు. ఉదయం కొంత సమయం, సాయంత్రం కొంత సమయం వెచ్చించడం కారణంగా ఐదు కిలోమీటర్లు దూరాన్ని రెండు పర్యాయాలు చేరుకోవాల్సి వస్తుందని అన్నారు. అలాగే గతంలో కూలీల కోసం ఏర్పాటుచేసిన సదుపాయాలు నేడు కరువయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ వ్యవసాయ కార్మిక సంఘాలు, ప్రజా సంఘాలు, వామపక్ష పార్టీలు పోరాటాల ఫలితంగా ఈ చట్టాన్ని పొందగలిగామన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం నిర్ణయించిన రూ 300 కనీస వేతనాన్ని ఎటువంటి కోత విధించకుండా అమలు చేయాలని డిమాండ్ చేశారు. పలుగు, పార , మంచినీళ్లకు అలాగే కూలీలకు సమ్మర్ అలవెన్స్ ప్రకటించాలని అన్నారు.

కనీసం తాగునీళ్లన్నా ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి దుగ్గిరాల : ఉపాధి హామీ కూలీలకు పనులు జరిగే ప్రాంతంలో మంచినీరు మెడికల్ కిట్ లాంటి కనీస సౌకర్యాలు కల్పించాలని సిపిఎం పార్టీ నాయకులు జొన్నా శివశంకరరావు కోరారు. మండలంలోని చిలువూరు గ్రామ సమీపంలో గురువారం ఉపాధి హామీ కూలీలతో మాట్లాడారు. మే నెలలో సమ్మర్ అలవెన్స్ ఇవ్వాలన్నారు. కేంద్ర ప్రభుత్వం గత సంవత్సరం కంటే బడ్జెట్లో తక్కువ నిధులు కేటాయించిందని అందువలన వేతనాలు పని దినాలు తగ్గాయి అన్నారు. జెట్టి బాలరాజు మాట్లాడుతూ వంద రోజులు పని దినాలు కల్పించాలని ప్రస్తుతం 25 నుండి 30 కన్నా ఎక్కువ పనిని కల్పించడం లేదన్నారు. గతంలో పే స్లిప్పులు ఇచ్చే వారిని ఇప్పుడు ఎంత వేతనం వస్తుందో తెలియటం లేదన్నారు. కార్యక్రమంలో కె జైపాల్ టి రామారావు ఏ అంజయ్య గోపిరెడ్డి పాల్గొన్నారు.

పని ప్రదేశంలోనే హాజరు నమోదు చేయాలి

ప్రజాశక్తి - పెదకాకాని :ఉపాధి చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని సిఐటియు జిల్లా కార్యదర్శి నన్నపనేని శివాజి డిమాండ్ చేశారు. గురువారం మండలం లోని ఉప్పలపాడులో ఉపాధి పనులను పరిశీలించారు. ఈసందర్భంగా ఉపాధి కూలీలు పలు సమస్యలనునాయకులకు తెలిపారు. హాజరు ఫోటోల కోసం పని అనంతరం గంటల తరబడి నిరీక్షించాల్సి వస్తుందని ఇందు కోసం రెండు కిలోమీటర్ల దూరం వెళ్లి రావాల్సి వస్తుందని ఆవేదన వెల్లుబుచ్చారు. అనంతరం రాజా రమేష్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో శివాజీ మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఉపాధి హామీ చట్టానికి బడ్జెట్లో నిధులను భారీగా కొత విధించిందని చట్టాన్ని నిర్వీర్యం చేస్తు ందని విమర్శించారు. వ్యవసాయం పనులు లేని రోజుల్లో పేదలకు పనులు కల్పిస్తూ కడుపు నింపే చట్టాన్ని మరింత సమర్థవంతంగా అమలు చేయించుకోవాల్సిన అవసరం ఉందని ఇందుకోసం కూలీలంతా ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. ప్రతి కుటుంబానికి కనీసం 100 పని దినాల కల్పంతో పాటు వేసవి ఎండలు తీవ్రత నేపథ్యంలో కూలీలకు సమ్మర అలవెన్స్ ఇవ్వాలని ఒక కూలీకి రెండు రూపాయలు చొప్పున మేట్లకుఅదనంగా చెల్లించాలని కోరారు. పని ప్రదేశంలో కూలీలకు హాజరు నిరీక్షించే అవసరం లేకుండా నమోదు చేయాలని అన్నారు. కూలీలకు తాగునీరు మజ్జిగ మెడికల్ కిట్లు అందుబాటులో ఉంచాలని కోరారు. కార్యక్రమంలో బండ్లమూడి శ్రీనివాసులు చిలుకూరి వీరయ్య వి శ్రీనివాస్ పాల్గొన్నారు.



నాగలపాడులో ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న పాశం రామారావు



దుగ్గిరాలలో ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న జొన్నా శివశంకరరావు



ఉప్పలపాడులో ఉపాధికూలీలతో మాట్లాడుతున్న ఎన్ శివాజి



తేలప్రోలులో ఉపాధి పనులు పరిశీలిస్తున్న ఈమని అప్పారావు తదితరులు

ఒంటెద్దు పోకడలు తగదు

పొన్నూరు రిటర్నింగ్ అధికారిపై టిడిపి ఫిర్యాదు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

పొన్నూరు నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి ఎ.లక్ష్మీకుమారి ఒంటెద్దు పోకడలతో ఎన్నికల ప్రక్రియను తన ఇష్టానుసారంగా మారుస్తున్నారని టిడిపి నాయకులు గురువారం జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. కౌంటింగ్ కేంద్రంలో అభ్యర్థి గాని, చీఫ్ ఏజెంట్ గాని ఒక్కరే ఉండాలని అసంబద్ధ నిర్ణయాలతో మౌఖిక ఆదేశాలు జారీ చేస్తున్నారని వారు కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు ఆర్.వో.కు నచ్చచెప్పాలని నిబంధనలు పాటించాలని కోరినా పెడచెవిన పెడుతున్నారని మాజీ ఎమ్మెల్సీ ఎ.ఎస్.రామకృష్ణ, టిడిపి నాయకులు మన్నవ సుబ్బారావు, మాదల వెంకటేశ్వర్లు చెప్పారు. ఆర్.వో. వ్యవహారములో ఇప్పటికే ఎన్నికల ప్రక్రియ తికమకగా మారిందని, పోలింగ్ రోజున పి.వో. డైరీలు అదృశ్యం అయ్యాయని తెలిపారు. 17సి ఫారాలు గల్లంతు ఘటనతో 2 రోజులు ఆలస్యంగా పోలింగ్ శాతం నిర్ధారించారని చెప్పారు. ఎన్నికల నియమావళి స్పష్టంగా ఆర్.వో.టేబుల్ వద్ద ఏజెంట్లు ఉండి పర్యవేక్షించుకోవాలని చెబుతున్నప్పటికీ ఆ నియమాలు అమలు చేయబోము అంటు భీష్మించుకూర్చున్నారని తెలిపారు. ఇలాంటి అసమర్థ నిర్ణయాలతో పోలింగ్ రోజు వచ్చిన తలనొప్పిలే కౌంటింగ్ రోజున వస్తాయని వారు కలెక్టర్‌కు వివరించారు. ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైనప్పటి నుండి పొన్నూరు ఆర్.వో. ఎ.లక్ష్మీ కుమారి తీసుకుంటున్న అన్ని నిర్ణయాలు వివాదస్పదమవుతున్నాయన్నారు. పార్టీ నాయకులు మాకిరెడ్డి జయరామిరెడ్డి, దొప్పలపూడి శ్రీనివాసరావు, పాశం నవీన్ తదితరులు పాల్గొన్నారు.



తెనాలిలో



ఎర్రబాలెంలో

ఘనంగా సిఐటియు వార్షికోత్సవం

ప్రజాశక్తి-తెనాలిరూరల్

సిఐటియు 54వ వార్షికోత్సవం సందర్భంగా తెనాలి డాల్ మిల్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో సిఐటియు జెండా ఆవిష్కరించారు. స్థానిక సుల్తానాబాద్ శేషాద్రి డాల్ మిల్ ఆవరణలో యూనియన్ జనరల్ సెక్రటరి జి వెంకట సుబ్బయ్య సిఐటియు పతాకాన్ని ఎగురవేశారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి సిఐటియు జిల్లా నాయకులు కొల్లిపర బాబు ప్రసాద్ మాట్లాడుతూ 1970లో కలకత్తా లో సిఐటియు ఆవిర్భవించిందన్నారు. ఆవిర్భ మహా సభలో స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొన్న గొప్ప నాయకులు కామ్రేడ్ జ్యోతిబసు, సమర్ ముఖర్జీ, బిటి రణదేవ్, ఎంకె పాండే, పి రామమూర్తి, సుకుమల్ సేన్, నండూరి ప్రసాదరావు, పర్సా సత్యనారాయణ తదితర నాయకులు మూడు రోజులపాటు సుధీర్ఘ చర్చల అనంతరం మే 30న తేదిన సిఐటియు ఆవిర్భవించిందని తెలిపారు. సెంటర్ ఆఫ్ ఇండియన్ ట్రేడ్ యూనియన్స్, భారత దేశంలోని కార్మిక సంఘాలకు, సిఐటియు కేంద్రంగా పనిచేయాలని లక్ష్యంగా పెట్టారన్నారు. ఇరవై సార్వత్రిక సమ్మెలు జరిగాయన్నారు. బిఎంఎస్ చెంచుపేట ప్రజాసంఘాల కార్యాలయంలో సిఐటియు జిల్లా కార్యదర్శి షేక్ హుస్సేన్ వలి సిఐటియు జెండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో డి పవన్ రెడ్డి, కొండవీటి శ్రీనివాసరావు, డి ఏడుకొండలు, డి వాసు రెడ్డి, మురళీ కష్ణ రెడ్డి,టి కాశీవిశ్వనాథ్, కె పేరిరెడ్డి, కె రాజ్యలక్ష్మి, ఈశ్వరి, ఎం వెంకటేశ్వర్లు, శ్రీనివాస రావు, ఆర్ శివకష్ణ,టి సాయి, ఎం శివ శాంబిరెడ్డి పాల్గొన్నారు.

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

ఎర్రబాలెంలో సిఐటియు వార్షికోత్సవం సందర్భంగా జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిఐటియు రాజధాని డివిజన్ అధ్యక్షులు ఎం రవి మాట్లాడుతూ సిఐటియు కార్మికుల హక్కుల కై ఎన్ని ఆటంకాల నైనా ఎదుర్కొని నికరంగా నిలిచి పోరాడుతుందని అన్నారు. సిఐటియు చేసిన పోరాటాలు, త్యాగాలు చేసికార్మిక చట్టాలను కార్మిక వర్గం సాధించుకున్నదని అన్నారు. కార్మిక వర్గం పోరాడి సాధించుకున్న చట్టాలను కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం తుంగలో తొక్కి, నాలుగు లేబర్ కోడులను తీసుకొచ్చి కార్మికుల గొంతు నొక్కేందుకు కుట్రలు చేస్తుందని రవి అన్నారు. కార్మికులు పోరాడిసాధించుకున్న చట్టాలను రద్దు చేయాలని చూస్తే పాలకులు కార్మికుల ఆగ్రహానికి గురి కావాల్సి వస్తుందని రవి హెచ్చరించారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు టీ బాబు, ఓ రామారావు, ఎం పార్వతి, శ్రీను, ఎం నాగేశ్వరరావు, టీ ప్రసాద్, టి సాంబయ్య, ఎం మేరీ, విశ్రాంతమ్మ పాల్గొన్నారు.



కాల్వల్లో పేరుకుపోయిన గుర్రపుడెక్కను వెంటనే తొలగించాలి

ప్రజాశక్తి-తెనాలిరూరల్

పంటకాల్వలు, మురుగు కాల్వల మరమ్మతుపనులను సత్వరమే చేయించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆంధ్ర ప్రదేశ్ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ములక శివ సాంబిరెడ్డి డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఈమని అప్పారావుతో కలసి ఫీడర్ ఛానల్, తదితర కాల్వలను గురువారం పరిశీలించారు. కాల్వల్లో పేరుకుపోయిన తూటికాడ, గుర్రపు డెక్క తొలిగించని కారణంగా కంచర్లపాలెం, తేలప్రోలు, ఐతానగర్ నేలపాడు అత్తోట ప్రాంతాలకు చెందిన 6 వేల ఎకరాల్లో పంట నష్టం వాటిల్లిందని శివసాంబిరెడ్డి తెలిపారు. ఈ ఏడాదైనా గుర్రపు డెక్క, తూటాకు తొలగించి అన్నదాతలను ఆదుకోవాలని కోరారు.



సమావేశంలో మాట్లాడుతున్న సిఐటియు జిల్లా నాయకులు ఎస్ ఎస్ చంగయ్య

క్లాప్ ఆటో డ్రైవర్ల సమస్యలను పరిష్కరించాలి

ప్రజాశక్తి - మంగళగిరి

క్లాప్ ఆటో డ్రైవర్లు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే అధికారులు స్పందించి పరిష్కరించాలని సిఐటియు జిల్లా నాయకులు ఎస్ ఎస్ చంగయ్య అన్నారు. గురువారం మంగళగిరి సీఐటీయూ కార్యాలయంలో క్లాప్ ఆటో డ్రైవర్ల యూనియన్‌విస్తృత సమావేశం యూనియన్ అధ్యక్షులు ప్రసాద్ అధ్యక్షతన నిర్వహించారు. చంగయ్య తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ క్లాప్ ఆటో డ్రైవర్లు గత రెండు నెలలుగా జీతాలు రాక ఇబ్బందులు పడుతున్నారని వెంటనే వారి జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. రూ.12000 వేతనం అని, పదివేల రూపాయలు మాత్రమే ఇస్తున్నారని అన్నారు. క్లాప్ ఆటో డ్రైవర్లకు వేతనాలు పెంచాలని, పెండింగ్‌లో ఉన్న జీతాలను చెల్లించాలని డిమాండ్ చేశారు. గత వారం రోజులుగా స్లాబ్ ఆటో డ్రైవర్లు సమ్మె చేస్తున్నప్పటికీ కార్పొరేషన్ అధికారులు పట్టించుకోవడం లేదని విమర్శించారు. వెంటనే అధికారి యంత్రాంగం, కార్పొరేషన్ అధికారులు కలగజేసుకొని వారి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సమ్మెలో ఉండటం వలన పట్టణంలో చెత్తాచెదారం పేరుకుపోతుందని అన్నారు. దీనివల్ల ప్రజలు అనారోగ్యానికి గురవుతారని తెలిపారు. ప్రజా ప్రయోజనాలు దృష్టిలో పెట్టుకుని అధికారులు వెంటనే వారి సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్పొరేషన్ అధికారులు స్వచ్ఛ ఆంధ్ర ప్రదేశ్ పరిధిలో వారు ఉన్నారని, దానికి సంబంధించిన కాంట్రాక్టర్ వేతనాలు చెల్లించాలని చెప్పడం జరిగిందని అన్నారు. అందువలన కాంట్రాక్టర్, కార్పొరేషన్ అధికారులు, స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ అధికారులు వెంటనే స్పందించి ఈ సమస్యను పరిష్కరించడానికి చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సిఐటియు పట్టణ నాయకులు వై కమలాకర్, సాయి, శివ పాల్గొన్నారు.



అనంతవరంలో 'అమరావతి వెలుగు'

ప్రజాశక్తి - తుళ్లూరు : రాష్ట్ర ఏకైక రాజధానిగా అమరావతిని కొనసాగించాలంటూ రైతులు,రైతు కూలీలు, మహిళలు చేస్తున్న దీక్షలు గురువారంతో 1626 వ రోజుకు చేరాయి.తుళ్లూరు, వెలగపూడి,అనంత వరం, వెంకటపాలెం, తాడికొండ తదితర గ్రామాల్లో ప్లకార్డులతో దీక్షలు కొనసాగాయి. రాష్ట్రాభివద్ధికి రాజధాని అమరావతి నిర్మాణం దోహదపడుతుందన్న విషయాన్ని పాలకులు గుర్తించాలని రైతులు విజ్ఞప్తి చేశారు.



మట్టిఖర్చులకు ఆర్థికసాయం

ప్రజాశక్తి -నాదెండ్ల

అనారోగ్యంతో మృతి చెందిన వారి కుటుంబాలకు ఆర్థిక సాయం నిమిత్తం రాష్ట్ర కార్మిక, రైతాంగ పరిరక్షణ సమితి, ఎపి గిరిజన సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో మట్టి ఖర్చులు నిమిత్తం ఆర్థిక సాయం అందజేశారు. మృతి చెందిన కుటుంబాల వారిక తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు. మండలంలోని గణపవరం అంబేద్కర్ కాలనీకి చెందిన పాకాల సావిత్రి భర్త అక్కిరాజు అనారోగ్యంతో బుధవారం రాత్రి మృతి చెందారు. రాజీవ్‌గాంధీ కాలనీ చెందిన కొలికి పెద్ద అంజయ్య తల్లి రాలు నాసరమ్మ అనారోగ్యంతో మృతి చెందారు. మృతుల కుటుంబాలకు ఆయా సంఘాల నాయకులు తమ సానుభూత తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్మిక, రైతాంగ పరిరక్షణ సమితి సింగు లెనిన్ బాబు, ఎపి గిరిజన సంఘాల ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షులు బి. శ్రీను నాయక్,పరిరక్షణ సమితి ఉపాధ్యక్షులు ప్రత్తిపాటి చిన్న, నాయకులు జి.చిరంజీవి, ఎం. శివాజీ, టి.వెంకట్ పాల్గొన్నారు.



వివాహానికి టిడిపి ఆర్థిక సహాయం

ప్రజాశక్తి-పెదకూరపాడు

మండలంలోని పొడపాడుకి చెందిన షేక్ చిన్న హుస్సేన్ కుమార్తె హుస్సేన్‌బి వివాహం సందర్భంగా జిల్లా తెలుగు దేశం పార్టీ అధ్యక్షులు కొమ్మాలపాటి శ్రీధర్ సహకారంతో మండల పార్టీ అధ్యక్షులు ఆర్తిమల్ల రమేష్ పదివేల రూపాయల ఆర్థిక సహాయం అందించారు. గురువారం పెదకూరపాడు మండల టిడిపి కార్యాలయంలో ఈ మొత్తాన్ని అందజేశారు. టిడిపి పొడపాడు గ్రామ అధ్యక్షుడు షేక్ నబి సాహెబ్, పెదకూరపాడు మండల క్లస్టర్ ఇన్‌ఛార్జి వి.అప్పారావు, నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షులు ఎం.సాగర్, ఎ.ప్రసాదు పాల్గొన్నారు.

50 శాతం రాయితీపై పచ్చిరొట్ట విత్తనాలు

ప్రజాశక్తి-నకరికల్లు

ఖరీఫ్ పంట ప్రణాళికలో భాగంగా అన్ని రైతు భరోసా కేంద్రాలలో సిబ్బంది ద్వారా పొలాలలో మట్టి నమూనాలను సేకరిస్తున్నారు. వాటిని ల్యాబ్ కు పంపించి మట్టి పరీక్షల ద్వారా రైతులు సాగు చేసే నెలలో పంటలకు కావలసిన స్థూల,సూక్ష్మ పోషకాల లభ్యత, సేంద్రీయ పదార్థం లభ్యత తోపాటు వివిధ పంటలకు సాగుకు వాడాల్సిన ఎరువులను సిఫార్సు చేయడం జరుగుతుందని మండల వ్యవసాయ శాఖ అధికారి దేవదాసు గురువారం తెలిపారు. అలాగే, పచ్చిరొట్ట ఎరువు విత్తనాలు 114.5 క్వింటాళ్ల జీలుగ, 104.4 క్వింటాళ్ల జనుము,54.8 క్వింటాళ్ల పిల్లి పెసర, 50 శాతం రాయితీపై రైతులకు పంపిణీ చేసేందుకు రైతు భరోసా కేంద్రాలకు చేర్చామన్నారు. జీలుగా, జనుము ఒక కేజీ ధర రూ.88 కాగా, 50 శాతం రాయితీపై రూ.44 కు అందజేస్తామని చెప్పారు. పిల్లి పెసర రూ.134 కాగా, రూ.67కు పంపిణీ చేయడం జరుగుతుందని వివరించారు.

వేడిగాలులు .. ప్రజలు బెంబేలు

- అధిక ఉష్ణోగ్రతలు.. రోడ్లపై కనిపించని జనం
- పగటి పూట వలె రాత్రిళ్లూ వేడిగాలులు
- ఉక్కపోతతో ప్రజలు సతమతం
- పెరుగుతున్న కరెంట్ వాడకం



గురువారం మధ్యాహ్నం చిలకలూరిపేటలోని ఓ రోడ్డులో..

ప్రజాశక్తి - చిలకలూరిపేట

భానుడు విజృంభిస్తుండటంతో పగటిపూట అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఉదయం 8 గంటల నుండి ఎండలు మండిపోతున్నాయి. సాయంత్రం ఆరు గంటలు దాటినా వేడి గాలులు తగ్గని పరిస్థితి.

తీవ్రమైన ఎండ కారణంగా మధ్యాహ్న సమయంలో చిలకలూరిపేటలో రోడ్లన్నీ దాదాపు నిర్మానుష్యంగా ఉంటున్నాయి. గత రెండు రోజుల నుంచి అధిక ఉష్ణోగ్రతల కన్నా రెండు నుంచి మూడు డిగ్రీలు అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతుండటంతో ప్రజలు నానా ఇబ్బంది పడుతున్నారు. పగటిపూట వలె రాత్రి సమయంలో కూడా వేడిగాలులు వీస్తున్నాయి. చెమటలు, ఉక్కపోత తప్పట్లేదు. ఇళ్లల్లో ఎసిలు, కూలర్లు ఉన్న వారికి వేడి సెగ లేకుండా ఉపశమనం పొందుతున్నారు. ఇక, ఫ్యాన్లు వేసుకునే వారి పరిస్థితి అగ్ని గుండంలో కూర్చున్నట్టే ఉంటోంది.



వీధి శునకాల కోసం చిలకలూరిపేటలోని ఓ ఇంటి ముందు బకెట్‌లో ఉంచిన నీరు

వేడిగాలి వస్తుండటంతో వృద్ధులు, ముఖ్యంగా చిన్న పిల్లలు, స్థూలకాయలు, బాలింతలు అల్లాడిపోతున్నారు. ఫ్యాన్, కూలర్ ఉన్న ప్పటికీ ఉక్కపోత తప్పట్లేదు. నిరంతరం ఫ్యాన్లు, కూలర్లు నడుస్తుండటంతో విద్యుత్ బిల్లులు కూడా భారీగా వస్తున్నాయని పట్టణ ప్రజలు చెబుతున్నారు. ఫ్యాన్, కూలర్ వేయక పోతే రాత్రి సమయంలో దోమల బెడద ఉంటోందని, కరెంట్ బిల్లులకు రెక్కలొచ్చినట్లు రెట్టింపు బిల్లు వసున్నాయంటున్నారు. అధిక ఉష్ణోగ్రతలకు ఇళ్లపై ఉన్న ట్యాంకుల్లోని నీరు సైతం వేడెక్కి పోతుండటంతో రాత్రి 8,9 గంటలైనా వేడి నీరే వస్తున్నాయని పట్టణ ప్రజలు అంటున్నారు. వీధి కుక్కలు సైతం నీరు దొరక్క అల్లాడి పోతున్నాయి. పొలాల్లో నీళ్ల లేక పోవడంతో పశువులను ఇంటి వద్దే ఉంచుతున్నట్లు రైతులు చెబుతున్నారు.

పట్టణంలో 144వ సెక్షన్ అమల్లో ఉండటం,ఉదయం పదిలోపు, సాయంత్రం ఏడు గంటల తర్వాత ప్రజలు బయటకు వస్తున్నారని, దీంతో తమ వ్యాపారం పూర్తిగా తగ్గిపోయిందని, తోపుడు బండ్ల వాళ్ళు, చిరు వ్యాపారులు చెబుతున్నారు. అరటిపళ్ల, మామిడి, బొప్పాయి,(ద్రాక్షస పోటా,దానిమ్మ,) నిల్వ ఉంచుకునే అవకాశం లేకపోవడం, విక్రయించలేపోతుండటంతో తాము తీవ్రంగా నష్టపోవాల్సి వస్తోందని చెబుతున్నారు.

శరీరాన్ని చల్లని నీటితో శుభ్రం చేసుకోవాలి

శరీరాన్ని రెండు, మూడు సార్లు చల్లని నీటితో శుభ్రం చేసుకోవాలని లేకుంటే శరీర రుగ్మతలు వచ్చే అవకాశం ఉందని చర్మ రోగ వైద్యులు హెచ్చరిస్తున్నారు. ఒక వేళ చర్మరోగాలు ఉంటే కనుక వారు వీలైనంత చల్లగాలి తగిలే ప్రదేశాల్లో ఉండాలని, అవసరమైతే వైద్యులను సంప్రదించాలని చెబుతున్నారు.

జూన్ సామాజిక పింఛన్ బ్యాంక్ ఖాతాల్లోనే

- చిలకలూరిపేట మండల పరిధిలో 8,781 మంది లబ్ధిదారులు
- బ్యాంక్ ఖాతాలు ఉన్న లబ్ధిదారుల సంఖ్య 6,625
- ఖాతాలు లేని వారికి ఇళ్ల వద్దకే

ప్రజాశక్తి-చిలకలూరిపేట

మండల పరిధిలో ఉన్న అన్ని గ్రామ పంచాయతీల పరిధిలో ఉన్న 8,781 మంది సామాజిక పింఛన్ లబ్ధిదారులకు వారి వారి బ్యాంక్ ఖాతాల్లో డబ్బులు జూన్ 1వ తేదీనే జమ చేస్తారని ఎంపిడిఒ శ్రీనివాసరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. బ్యాంక్ ఖాతాలు ఉన్న వారు 6,625 మంది కాగా వారికి వారి వారి బ్యాంక్ ఖాతా ల్లో రూ.1,98,75,000 జమ చేయనున్నట్లు తెలిపారు. అదే విధంగా బ్యాంక్ ఖాతాలు లేని 2,156 మందికి రూ. 61,93,000 ఆయా గ్రామాల సచివాలయాల ఉద్యోగులు తమ పరిధిలో పింఛన్లను జూన్ ఒకటో తేదీనే లబ్ధిదారుల ఇండ్ల వద్దకే వచ్చి ఇస్తారని తెలపారు. పింఛన్‌దారులెవ్వరూ కంగారు పడాల్సిన అవసరం లేదని సూచించారు. ఒకవేళ సచివాలయం వద్దకు వచ్చిన వారికి అక్కడే పింఛన్ ఇచ్చేలా ఉద్యోగులను ఏర్పాటు చేశామని వివరించారు. ఎవరూ కంగారు పడొద్దని అటు సచివాలయాల వద్దకు,బ్యాంకుల వద్దకు పింఛన్‌దారులు ఒకే సారి వెళ్లొద్దని సూచించారు.



మధ్యాహ్నం భోజనం నిర్వహణ ఏజెన్సీలకు నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమం

మధ్యాహ్నభోజనం రుచికరంగా ఉండాలి

ప్రజాశక్తి - రెంటచింతల

ప్రభుత్వ పాఠశాలల్లో అమలు చేస్తున్న మధ్యాహ్న భోజనాన్ని విద్యార్థులకు రుచికరంగా, శుభ్రతతో వండి పెట్టాలని పలు జిల్లా పరిషత్తు పాఠశాలల హెచ్ఎంలు సూచించారు మధ్యాహ్నం భోజనం నిర్వహణ ఏజెన్సీలకు గురువారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఏ రోజు ఏ కూరలతో అన్నం వడ్డించాలో వీడియో ద్వారా చూపించారు. మెనూ పాటించాలని నాణ్యత ఉండాలని అన్నారు. డాక్టర్ చిన్నమ్మ హెచ్ఎం శౌరెడ్డి వీరయ్య పాల్గొన్నారు.

క్షయ వ్యాధిపై పోరు

పెద్దలకు బిసిజి టీకా

- 2025 నాటికి 'క్షయ' పూర్తి స్థాయి నివారణే లక్ష్యం
- 60 సంవత్సరాలు పైబడిన వారు అర్హులు
- 18-60 ఏళ్ల లోపు పొగ తాగేవారు కూడా



హసన్‌బాద్ సచివాలయంలో టీకా అమలు తీరును పరిశీలిస్తున్న డాక్టర్ సిరి చందన

ప్రజాశక్తి - క్రోసూరు

క్షయ వ్యాధిపై పోరును మరింత తీవ్రతరం చేయాలని ప్రభుత్వం సంకల్పించిన సందర్భంగా వయోజనులకు బిసిజి టీకా ఇవ్వడానికి రంగం సిద్ధమైనట్లు క్రోసూరు పిహెచ్‌సి వైద్య అధికారి డాక్టర్ సిరి చందన అన్నారు. గురువారం ఆమె హసన్‌బాద్ సచివాలయంలో జరుగుతున్న వయోజన బిసిజి టీకా కార్యక్రమం అమలు తీరును పరిశీలించారు ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 2025 నాటికి క్షయ వ్యాధిని పూర్తిస్థాయిలో నిర్మూలించాలనే లక్ష్యంతో 18 ఏళ్ల పైబడిన వారికి టీకా వేయాలని కేంద్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ నిర్ణయించినట్లు పేర్కొన్నారు. 60 సంవత్సరాలు పైబడిన వారు, 18 నుంచి 60 సంవత్సరాల లోపు పొగ తాగేవారు, 18 నుంచి 60 సంవత్సరాల లోపు మధు మేహ వ్యాధిగ్రస్తులు, ఎత్తు, బరువుల నిష్పత్తి బిఎంఐ (బాడీ మాస్ ఇండెక్స్) 18 కంటే తక్కువ ఉన్నవారికి, క్షయ వ్యాధిగ్రస్తుల కుటుంబ సభ్యులకు, 2018 నుంచి టిబి బారిన పడి చికిత్స పొందుతున్న వారు, 2021 వ సంవత్స రం జనవరి 1 నుంచి టిబి వ్యాధిగ్రస్తులతో కాంటాక్ట్‌లో ఉన్నవారు ఈ వయోజన వ్యాక్సిన్ వేయించుకునేందుకు అర్హులని వివరించారు. ఈ సందర్భంగా ఆరోగ్య విస్తరణ అధికారి శిఖా శాంసన్ మాట్లాడుతూ 18 సంవత్సరాల లోపల వారు, గర్భిణులు, బాలింతలు, హెచ్ఐవి వ్యాధిగ్రస్తులు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు, క్యాన్సర్ పేషెంట్లు, మూడు నెలల లోపల రక్త మార్పిడి చేయించుకున్న వారు, వ్యాక్సిన్ చేయించుకోవడానికి నిరాకరించిన వారు, బిసిజి , ఇతర వ్యాక్సిన్ లకు గతంలో తీవ్ర రియాక్షన్ వచ్చిన వారికి ఈ వ్యాక్సిన్ అవసరం లేదని తెలిపారు. కార్యక్రమంలో మహిళా, పురుష ఆరోగ్య కార్యకర్తలు, హెల్త్ సూపర్‌వైజర్లు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజాశక్తి 7
గుంటూరు జిల్లా
శుక్రవారం 31 మే 2024



ఆదమరిస్తే అంతే సంగతులు..

ప్రజాశక్తి - మంగళగిరి

మంగళగిరి పట్టణంలోని డిఎస్పి కార్యాలయం ఎదుట కుప్పురావు కాలనీ గేటు సమీపంలోని ప్రధాన రహదారిపై మ్యాను హోల్ తెరుచుకొని ఉంది. ఇటీవల నీటి కుళాయిల ప్రధాన పైప్ లైన్ మరమ్మతుల కోసం మ్యాన్ హోల్ తెరవడం జరిగింది. అయితే సిబ్బంది మూయకపోవడం వలన వాహనదారులు ఆదమరిస్తే పడిపోయే ప్రమాదం ఏర్పడింది. వస్తుంది వర్షాకాలం కాబట్టి వర్షాలు పడి ఈ మ్యాన్‌హోల్ నీటితో నిండిపోయే అవకాశం ఉంది. దాని వలన కూడా వాహనదారులు ప్రమాదాలు గురి అయ్యే అవకాశం ఉంది. వెంటనే కార్పొరేషన్ అధికారులు స్పందించి ఈ మ్యాన్ హోల్‌ను మూసివేయాలని, స్థానికులు వాహనదారులు కోరుతున్నారు.

సప్లిమెంటరీ పరీక్షకు 163 మంది హాజరు


ప్రజాశక్తి - దుగ్గిరాల

మండల కేంద్రం దుగ్గిరాలలోని బాలికల హైస్కూల్లో పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలకు గురువారం ఎక్కువ సంఖ్యలో విద్యార్థినీ విద్యార్థులు హాజరయ్యారు. మండల వ్యాప్తంగా పదో తరగతి తప్పిన 163 మంది విద్యార్థిని విద్యార్థులకు సప్లిమెం టరీ పరీక్షలు నిర్వహిస్తున్నారు. గురువారం సైన్స్ పరీక్షకుకు చాలా ఎక్కువమంది విద్యార్థిని విద్యార్థులు హాజరయ్యారు. మండల వ్యాప్తంగా సైన్స్ సబ్జెక్టులో ఎక్కువ మంది తప్పినట్లు మండల విద్యాధికారి కె శ్రీనివాసరావు తెలిపారు.

కౌంటింగ్ ఏర్పాట్లపై నగర కమిషనర్ సమీక్ష

ప్రజాశక్తి-గుంటూరు

సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపునకు అవసరమైన స్టేషనరిని వెంటనే సిద్ధం చేసి, యూనివర్సిటీలోని లెక్కింపు కేంద్రానికి తరలించాలని తూర్పు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, నగర కమిషనర్ కీర్తి చేకూరి అధికారులను ఆదేశించారు. గురువారం నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని తూర్పు రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో జూన్ 4న జరిగే ఓట్ల లెక్కింపునకు చేపట్టాల్సిన ఏర్పాట్లపై అధికారులతో సమీక్షా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆర్ఓ మాట్లాడుతూ కౌంటింగ్ రోజు ఉదయం 6 గంటలకల్లా అభ్యర్థులు, ఏజంట్లు కౌంటింగ్ కేంద్రానికి రావాలని తెలియజేశారు. ఓట్ల లెక్కింపులో తొలుత పోస్టల్ బ్యాలెట్స్, సర్వీస్ ఓట్లు లెక్కించడం జరుగుతుందన్నారు. పోస్టల్ బ్యాలెట్ కౌంటింగ్‌కు ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలకు సంబంధించిన సూచనలను ఆర్ఓలు, ఏఆర్ఓలు తప్పనిసరిగా చదివి అర్ధం చేసుకోవాలన్నారు. అధికారులు, సిబ్బంది కౌంటింగ్ రోజు తప్పనిసరిగా నిర్దేశిత సమయానికి, తగిన గుర్తింపు కార్డులతో హాజరు కావాలని, కౌంటింగ్ కేంద్రంలోకి సెల్‌ఫోన్ అనుమతి లేదని స్పష్టం చేశారు. కౌంటింగ్ కేంద్రంలో తగిన టేబుల్స్, ఇంటర్నెట్ కనెక్షన్, కంప్యూటర్లు, ఆపరేటర్లు ఉండేలా పర్యవేక్షణ చేయాలన్నారు. సమావేశంలో ఏఆర్ఓలు వెంకట లక్ష్మీ, సునీల్ కుమార్, భీమరాజు, ప్రదీప్ కుమార్, డిప్యూటీ కమిషనర్ వెంకట కష్ణయ్య, ఈఈ సుందర్రామిరెడ్డి, మేనేజర్ ఎస్.ఎన్.ప్రసాద్, ఎన్నికల డిప్యూటీ తహసిల్దార్ నాగమల్లేశ్వరరావు, సూపరిండెంట్లు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కమిషనర్

21 రౌండ్లలో గుంటూరు పశ్చిమ ఫలితం

ప్రజాశక్తి-గుంటూరు

సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు విధి విధానాలను కౌంటింగ్ సిబ్బందితో పాటు అధికారులు కూడా సమగ్రంగా అధ్యయనం చేయాలని నగర పాలక సంస్థ అదనపు కమిషనర్, పశ్చిమ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి కె.రాజ్యలక్ష్మి ఆదేశించారు. గురువారం నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో జూన్ 4 న జరిగనున్న ఓట్ల లెక్కింపు ఏర్పాట్లపై తీసుకోవాల్సిన చర్యలపై అధికారులతో సమీక్షా సమావేశం జరిగింది.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈవియం ఓట్ల లెక్కింపునకు 14 టేబుల్స్, పోస్టల్ బ్యాలట్ ఓట్ల లేకింపునకు 5 టేబుల్స్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఓట్ల లెక్కింపు మొత్తం 21 రౌండ్స్‌లో పూర్తి అవుతుందన్నారు. ఓట్ల లెక్కింపులో తొలుతగా పోస్టల్ బ్యాలెట్స్, సర్వీస్ ఓట్లు లెక్కించడం జరుగుతుందని, పోస్టల్ బ్యాలెట్ కౌంటింగ్‌లో వ్యాలిడ్, ఇన్‌వ్యాలిడ్ ఓట్లను ఎలా వేరు చేయాలో ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలకు సంబంధించిన సూచనలను ఆర్ఓలు, ఏఆర్ఓలు తప్పనిసరిగా చదివి అర్ధం చేసుకోవాలన్నారు. కౌంటింగ్‌కు అవసరమైన మెటీరియల్‌ను చెక్ లిస్ట్ మేరకు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు.సమావేశంలో డిప్యూటి కమీషనర్ సి.హెచ్ శ్రీనివాసరావు, ఈ.ఈలు కొండారెడ్డి, కోటేశ్వర రావు, డి.ఈ.ఈలు రఫిక్, సూపరిండెంట్లు వెంకటరామయ్య, పద్మ, ఎ.సి.పి అజయ్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న అడిషనల్ కమిషనర్

మధ్యాహ్న భోజనం ఇకపై మరింత రుచికరం

ప్రజాశక్తి-తెనాలిరూరల్

ఐదు నక్షత్రాల హోటల్లో చెఫ్స్ తరహా నాణ్యమైన, రుచికరమైన భోజనాన్ని అందించడమే విద్యా శాఖ ముఖ్య ఉద్దేశ్యమని మండల విద్యాశాఖాధికారి వి జయంతి బాబు అన్నారు. మధ్యాహ్న భోజన పథకం ద్వారా విద్యార్థులకు పౌష్టికాహారాన్ని అందిస్తున్న సిసిహెచ్ (కుక్ కం హెల్పర్స్) నిర్వహకులకు రావి సాంబయ్య మున్సిపల్ ఉన్నత పాఠశాలలో ఒక్కరోజు శిక్షణ కార్యక్రమం గురువారం నిర్వహించారు. తెనాలి మండల విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిక్షణ కార్యక్రమంలో ఎంఈఓ వి జయంతి బాబు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజన పథకం, ఆరోగ్యకర వాతావరణంలో అందిస్తున్నామన్నారు. పోషక విలువలతో కూడిన భోజనాన్ని మెనూ ప్రకారం విద్యార్థులకు అందించడంలో సిసిహెచ్ నిర్వాహకులు ప్రత్యేక శ్రద్ధ కనబరచాలని సూచించారు. పరిశుభ్రత, సమయపాలనలో ఎక్కడ రాజీ పడకూడదని తెలిపారు. అనంతరం ఎంఈఓ-2 ఎం లక్ష్మీనారాయణ మాట్లాడుతూ పోషక విలువలు కూడిన కోడిగుడ్లను విద్యార్థులకు అందించే బాధ్యత సిసిహెచ్ నిర్వాహకులదే అన్నారు. రాగిజావ చేయడంతో పాటుగా విద్యార్థులతో తాగించి బాధ్యత కూడా వారిపైనే ఉందన్నారు. శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న రిసోర్స్ పర్సన్ శాంతమ్మ మాట్లాడుతూ రాష్ట్ర స్థాయిలో నిర్వహించిన శిక్షణ తరగతుల్లో తాను తెలుసుకున్న అంశాలను వివరించారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంఈఓ జయంతి బాబు

మధ్యాహ్న భోజన పథకంలో పాల్గొన్న కుక్ కం హెల్పర్స్ తప్పనిసరిగా చేతికి గ్లౌజు, హెడ్ క్యాప్ ధరించి భోజనం వడ్డించాలన్నారు. శిక్షణ కార్యక్రమంలో వంట పోటీలు నిర్వహించి మెనూలో పొందుపరిచిన వంటలు రుచికరంగా వండినవారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో మారిస్ పేట మున్సిపల్ ప్రైమరీ స్కూల్, కొలకలూరు జడ్పీహెచ్ స్కూల్, ఎరుకలపూడి ప్రైమరీ స్కూల్ బహుమతులు గెలుచుకున్నారు. ఎంఈఓ-2 వి జయంతి బాబు చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. శిక్షణ కార్యక్రమంలో మండలంలోని అర్బన్ రూరల్ ఎండిఎం నిర్వాహకులు, మండల విద్యాశాఖ కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.

దేశంలోనే రోల్‌మోడల్‌గా ది విశాఖపట్నం కో-ఆపరేటివ్ బ్యాంక్

బ్యాంక్ డైరెక్టర్ జే వీ సత్యనారాయణమూర్తి

ప్రజాశక్తి - మంగళగిరి : ది విశాఖపట్నం కో ఆపరేటివ్ బ్యాంక్ మంగళగిరి బ్రాంచ్ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆ బ్యాంక్ డైరెక్టర్ జే వీ సత్యనారాయణమూర్తి విజ్ఞప్తి చేశారు. ది విశాఖపట్నం కో-ఆపరేటివ్ బ్యాంక్ మంగళగిరి బ్రాంచ్ సభ్యుల మహాసభ మంగళగిరి నగరంలోని నన్నపనేని కళ్యాణ మండపంలో గురువారం నిర్వహించారు. ఇంచార్జ్ డైరెక్టర్ పీవీ రమణారావు అధ్యక్షతన సభలో జే వీ సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ మంగళగిరి బ్రాంచ్ 2023-24, ఆర్థిక సంవత్సరానికి మంగళగిరి బ్రాంచ్‌లో 746, మంది సభ్యులతో రూ 1.45 కోట్లలో షేర్ ధనం కలిగి ఉందన్నారు. డిపాజిట్లు రూ 7.22 కోట్లు ఉండగా, రుణాలు రూ 17.92 కోట్లు ఉన్నాయన్నారు. ఈ బ్యాంక్ ఒకరి కోసం అందరూ అందరి కోసం ఒక్కరు అని నినాదంతో పనిచేస్తుందన్నారు. సభ్యులే యజమానులుగా గల బ్యాంక్ ది విశాఖపట్నం కో-ఆపరేటివ్ బ్యాంక్ అని తెలిపారు. మన బ్యాంకు మధ్యతరగతి దిగువ మధ్యతరగతి ప్రజలకు అందుబాటులో ఉంటుందని వివరించారు. మంచి మార్కులు సాధించిన సభ్యుల పిల్లలకు నగదు పురస్కారాలు అందిస్తున్నామని చెప్పారు. సభ్యులకు మెడికల్ క్లెయిమ్ సదుపాయం కూడా అందజేస్తున్నామన్నారు. దేశంలోనే మన బ్యాంకు రోల్ మోడల్ గా ఉండాలంటే ప్రతి సభ్యుడు కనీసం మరొక సభ్యుడుని బ్యాంకుకు పరిచయం చేసి ఖాతా దారునిగా ఉండేలా చూడాలని ఆయన కోరారు. సాధారణ ప్రజలకు, చిన్న వ్యాపారులకు, స్వయం ఉపాధి, పొందు తున్న వారికి విద్యా, వైద్య సంస్థల అభివృద్ధికి, వివిధ రకాల రుణాలను అందిస్తూ బ్యాంక్ తోడ్పడుతుందన్నారు.



మాట్లాడుతున్న జెవి సత్యనారాయణమూర్తి



హాజరైన వినియోగదారులు

ముందుగా మంగళగిరి బ్రాంచ్ 2023 - 24 ఆర్థిక సంవత్సరంలో ఇద్దరు సభ్యులు మరణించగా వారికి సంతాపం తెలియజేశారు. సమావేశంలో ది విశాఖపట్నం కో-ఆపరేటివ్ బ్యాంక్ ఇన్చార్జి డైరెక్టర్ సిహెచ్ కోటేశ్వరరావు, జోనల్ మేనేజర్ సిహెచ్ వి ఆర్ సుబ్రహ్మణ్యం, మంగళగిరి బ్రాంచ్ మేనేజర్ ఫణి ప్రసాద్, కమిటీ సభ్యులు బత్తూరి మోహన్రావు, అలా వెంకటస్వామి, జ్యోతుల రవిబాబు, మారెళ్ళ సాంబశివరావు, నూతనంగా ఎన్నుకోబడిన కమిటీ సభ్యురాలు వెనిగళ్ళ నాగకుమారి, సభ్యులు పిల్లల మర్రి నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.



ప్రచార వాహనాన్ని ప్రారంభించిన ఎస్ఐ తదితరులు

వాహనం ద్వారా ప్రజలకు అవగాహన

ప్రజాశక్తి - దుగ్గిరాల

4వ తేదీన సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ జరగనున్నందున ప్రజలు ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు పాల్పడకుండా అవగాహన కల్పించే నిమిత్తం స్థానిక పోలీసులు ప్రత్యేక వాహనం ద్వారా మండలంలో ప్రచార కార్యక్రమాన్ని ప్రారంభించారు. స్థానిక ఎస్ఐ బి మహేంద్ర ఈ సందర్భంగా మాట్లాడుతూ మండల వ్యాప్తంగా 144 సెక్షన్ అమలు ఉన్నదని అందువలన బాణాసంచా కాల్చుటం ర్యాలీలు సభలు నిర్వహించటం నిషేధించడ మైనది అన్నారు. సమస్యాత్మక గ్రామాలైన చిలువూరు, పేరుకలపూడి, గొడవర్రు వీర్లపాలెం, ఈమని, కంఠంరాజు కొండూరు, గ్రామాలలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయటం జరిగిందన్నారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు పాల్పడిన ఆధారంతో సహా దొరికిపోతారని తెలిపారు. అవాంఛనీయ సంఘటనల్లో పాల్గొని కుటుంబాలకు దూరం కావద్దని ఎస్ఐ గ్రామస్థలకు హితవు పలికారు. పిడి యాక్ట్ కింద కేసులు నమోదు చేసి జైలుకు పంపిస్తామని అందువలన ఎటువంటి అవాఛనీయ సంఘటనలకు పాల్పడకుండా సద్భావనతో మెలగాలని తెలిపారు.



ప్రింటర్,వెబ్ కెమెరాను అందజేస్తున్న విఆర్‌కె చారీ

మాజీ సైనికుల సేవలు అభినందనీయం

ఎక్స్ జిల్లా సైనిక వెల్ఫేర్ అధికారి వి.ఆర్.కే.చారి

ప్రజాశక్తి - మంగళగిరి : మంగళగిరి వెట్రన్స్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో మాజీ సైనికులకు అందిస్తున్న సేవలు అభినందనీయం అని మాజీ మేజర్ మాజీ గుంటూరు జిల్లా సైనిక్ వెల్ఫేర్ అధికారి వి.ఆర్.కే.చారి అన్నారు. మంగళగిరి వెట్రన్స్ ఆర్గనైజేషన్ కార్యాలయంను గురువారం సందర్శించి సభ్యత్వం తీసు కున్నారు. అనంతరం గౌరవ అధ్యక్షులు గోవిందరావు, అధ్యక్షులు శంకర రెడ్డి గార్లతో చర్చించి కార్యలయం లో మెరుగైన సేవలు అందించేందుకు తనవంతు సహాయంగా కెనాన్ ప్రింటర్, వెబ్ కెమెరా అందించారు. ఈ సందర్భంగా గౌరవ అధ్యక్షులు కే.గోవిందరావు, అధ్యక్షులు జి.శంకర రెడ్డి మేజర్ చారి ని మంగళగిరి వెట్రన్స్ ఆర్గనైజేషన్ తరుపున కృత జ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఆర్గనైజేషన్ ఉపా ధ్యక్షులు సి.హెచ్. సాంబశివరావు, ప్రధాన కార్యదర్శి రవి బాబు, కోశాధికారి కే.సాంబశివరావు, సబ్ ట్రెజరర్ జి.వేణుగోపాల్, పాలక మండలి సభ్యులు పాల్గొన్నారు.

భవిత కేంద్రాల్లో వికలాంగులకు సేవలు

ప్రజాశక్తి - దుగ్గిరాల



భవిత కేంద్రాలను బలోపేతం చేసి వికలాంగ పిల్లలకు సేవలు అందించే దిశగా ప్రభుత్వం చర్యలు చేపడుతుందని మండల విద్యా శాఖ అధికారి కె శ్రీనివాసరావు తెలిపారు. జూన్ 9వ తేదీ వరకు మండలంలోని అన్ని గ్రామాలలో ఇంటింటికి తిరిగి ఐ ఈ ఆర్ పి లు సర్వే నిర్వహించి అంగవైకల్యం కలిగిన పిల్లలను గుర్తించి వారికి మండల కేంద్రంలోని భవిత కేంద్రాలలో ప్రత్యేక విద్య, ఫిజియోథెరపీ, స్పీచ్ తెరఫీ లాంటి సేవలు అందిస్తారన్నారు. ఇప్పటివరకు మండల వ్యాప్తంగా 53 మంది పిల్లలను గుర్తించినట్లు తెలిపారు.

వర్సిటీలోని ఓట్ల లెక్కింపు కేంద్రాల పరిశీలన

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి



ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో గుంటూరు పార్లమెంటు నియోజకవర్గం మరియు ఏడు శాసనసభ నియోజకవర్గాలకు సంబ ధించిన ఓట్ల లెక్కింపు ఏర్పాట్లను గురువారం సాయంత్రం కలెక్టర్ ,జిల్లా ఎన్నికల అధికారి ఎం.వేణుగోపాల్ రెడ్డి పరిశీలించారు. జిల్లా జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారి, గుంటూరు నగరపాలక సంస్థ కమిషనర్ కీర్తి చేకూరి, తెనాలి సబ్ కలెక్టర్ ప్రఖార్ జైన్, నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులతో ఆయన చర్చించారు. ముందుగా ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో డైక్ మెన్ ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ సందర్శించి అక్కడ ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను పరిశీలించారు. అనంతరం పాత్రికేయులకు మీడియా సెంటర్ కొరకు ఏర్పాటు చేయు హాల్ ను పరిశీలించి తగు సూచనలు జారీ చేశారు. గుంటూరు పార్లమెంటు నియోజక వర్గం ఏఆర్ఓ భీమారావు , నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ రాజ్యలక్ష్మి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ లక్ష్మీ కుమారి, గుంటూరు ఆర్డిఓ శ్రీకర్ , తదితరులు పాల్గొన్నారు.

బిసిజి టీకాలు లక్ష్యం మేరకు ఇవ్వాలి

టిబి వ్యాధి నివారణ రాష్ట్ర జాయింట్ డైరెక్టర్ డాక్టర్ రమేష్

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా



వైద్య సిబ్బంది నుండి వివరాలు సేకరిస్తున్న డాక్టర్ రమేష్

రాష్ట్ర వ్యాప్తంగా అమలు జరుగుతున్న అడల్ట్ బిసిజి వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని లక్ష్యం మేరకు పూర్తి చేయాలని టిబి వ్యాధి నివారణ రాష్ట్ర జాయింట్ డైరెక్టర్ డాక్టర్ రమేష్ ఆదేశించారు. కార్యక్రమాన్ని పర్యవేక్షించేందుకు పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేట వచ్చిన డాక్టర్ రమేష్ జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో జిల్లా ఇమ్యునైజేషన్ అధికారిణి డాక్టర్ బి.గీతాంజలి మరియు సిబ్బంది నుండి బిసిజి వ్యాక్సినేషన్ ప్రక్రియ అమలు సంబంధించిన వివరాలు సేకరించారు. అనంతరం పట్టణంలోని రామిరెడ్డిపేట అర్బన్ ఆరోగ్య కేంద్రం పరిధిలోని అరండల్ పేట సచివాలయంలో అదేవిధంగా బరంపేట అర్బన్ ఆరోగ్య కేంద్రం పరిధిలో గల ఏనుగుల బజార్ సచివాలయాలను సందర్శించి అక్కడ జరుగుతున్న అడల్ట్ బిసిజి వ్యాక్సినేషన్ ప్రక్రియను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. విధులు నిర్వహిస్తున్న ఆరోగ్య, ఆశా కార్యకర్తలతో బిసిజి వ్యాక్సిన్ వేయించుకున్న వారితో మాట్లాడారు. ఈ వ్యాక్సిన్ వేయించుకోవడం వలన భవిష్యత్తులో క్షయ వ్యాధి రాదని బిసిజి వాక్సిన్ గురించి ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు. 60 ఏళ్ళు పైబడిన వృద్ధులందరూ తప్పనిసరిగా బిసిజి వ్యాక్సిన్ వేయించు కోవాలని తెలిపారు. అనంతరం చిలకలూరిపేట పట్టణంలోని సుగాలి కాలనీ అర్బన్ సెంటర్ భావనఋషి నగర్ సచివాలయాన్ని సందర్శించి అక్కడ జరుగుతున్న వ్యాక్సిన్ ప్రక్రియను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇమ్యునైజేషన్ అధికారిణి డాక్టర్ బి .గీతాంజలి, జిల్లా టీబి అధికారి డాక్టర్ మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



లింగంగుంట్ల విలేజ్ హెల్త్ క్లినిక్‌లో వృద్ధురాలికి బిసిజి టీకా వేస్తున్న ఎఎన్ఎం

చీఫ్ సెక్రటరీని తొలగించాలి

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి



మాట్లాడుతున్న లక్ష్మణరెడ్డి తదితరులు

ఎసైన్డ్ భూముల విషయంలో అవినీతి ఆరోపణలు ఎదుర్కొం టున్న రాష్ట్ర చీఫ్ సెక్రటరీ డాక్టర్ కె.స్.జవహర్ రెడ్డిని ఎన్నికల విధుల నుండి తప్పించాలని జనచైతన్య వేదిక అధ్యక్షులు వల్లంరెడ్డి లక్ష్మణ రెడ్డి డిమాండ్ చేశారు. ప్రోగ్రెసివ్ ఫోరమ్ కన్వీనర్ పి.వి. మల్లికార్జునరావు, అఖిల భారత పంచాయితీ పరిషత్ జాతీయ ఉపాధ్యక్షులు డాక్టర్ జాస్తి వీరాంజనేయులు తెలుగు భాషోద్యమ సమాఖ్య కన్వీనర్ డాక్టర్ వి. సింగారావుతో కలిసి గురువారం తన కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆరుగురు సీనియర్ ఐ.ఏ.ఎస్ అధికారులను విస్మరిస్తూ జూనియర్ గా ఉన్న కె.ఎస్ .జవహర్ రెడ్డిని చీఫ్ సెక్రటరీగా నియమించిందని పేర్కొన్నారు. ఓటర్ల జాబితాలో అవకతవకలు జరుగుతున్న, వృద్ధులకు పెన్షన్లు ఇంటి వద్ద ఇవ్వకుండా సచివాలయాలు, బ్యాంకుల చుట్టూ తిరగటానికి అవకాశం ఇవ్వడం, ఎసైన్డ్ భూముల వ్యవహారంలో అభియోగాలు ఎదుర్కోవడం వంటి కారణాల దృష్ట్యా జూన్ 4వ తేదీన ఎన్నికల కౌంటింగ్ సక్రమంగా జరగడం కోసం చీఫ్ సెక్రటరీ డాక్టర్ కె.ఎస్. జవహర్ రెడ్డిని ఎన్నికల విధులు నుండి తప్పించాలని కోరారు. 1954 నుండి 2013 మధ్య 32 లక్షల ఎకరాల భూమిని పేదలు, దళితులకు ఎసైన్డ్ చేశారని ఈ భూములను రక్షించి, అభివృద్ధి చేసి, పేదల అభ్యున్నతికి తోడ్పాటును అందించాల్సిన రాష్ట్రప్రభుత్వం జీవో 596 ద్వారా లక్షలాది ఎకరాలు ఎసైన్డ్ భూమి అన్యాక్రాంతం కావటానికి దోహద పడిందన్నారు. ఎసైన్డ్ భూములకు హక్కులు కల్పించ బోతున్నార నే విషయం ముందుగానే తెలుసుకున్న అవినీతిపరులైన అధికారులు, రాజకీయ నేతలు వేలాది ఎకరాలు కొనుగోలు చేశారని అన్నారు. చీఫ్ మినిస్టర్ ఆఫీసులో ఉన్న ఒక ఉన్నతాధికారి కమీషన్ ద్వారా పొందిన వందలాది కోట్ల రూపాయలను వెచ్చించి, ఎసైన్డ్ భూముల్ని కొనుగోలు చేసినట్లు ఆరోపణలు వస్తున్న నేపథ్యంలో, రాష్ట్ర ప్రభుత్వం మౌనం వీడి, శ్వేత పత్రాన్ని విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

వివాదాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవు

కౌంటింగ్ రోజు వివాదాలు అరికట్టేందుకు పోలీసు శాఖ సన్నద్ధం : పల్నాడు జిల్లా ఎస్పి మల్లిక గర్గ్

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా



పల్నాడు జిల్లా నసరరావుపేటలో నిర్వహించిన పోలీసుకవాతులో పాల్గొన్న ఎస్‌సి

ఎన్నికల రోజున పల్నాడులో జరిగిన హింసాత్మక ఘటనలు పరిశీలిస్తే పల్నాడు ప్రజలలో కొందరికి పోలీసులు అంటే భయం లేదని అర్థమైందని అలాంటి వారికి పోలీసులు జులుం చూపించే సమయం ఆసన్నమైందని పల్నాడు జిల్లా ఎస్.పి మల్లిక గర్గ్ అన్నారు. గురువారం నరసరావుపేట పట్టణ పరిధిలోని సత్తెనపల్లి రోడ్డు వైపు గల మహాలక్ష్మి నగర్ నుండి పల్నాడు బస్టాండ్ వరకు జిల్లా పోలీస్ ఉన్నతాధికారులు కవాతు నిర్వహించారు. అనంతరం పల్నాడు బస్టాండ్ కూడలిలో పోలీసు సిబ్బందిని ప్రజలను ఉద్దేశించి ఎస్.పి మాట్లాడుతూ మే 13 తేదీన ఎన్నికల రోజు తిరిగి మరుసటి రోజు జరిగిన కొన్ని సంఘటనలు పల్నాడు జిల్లా పోలీసుల పరువును మంట కలిపిందని దేశం మొత్తం పల్నాడు ప్రాంతంలో జరిగిన ఘటనలు చూసి ఉలిక్కిపడిందన్నారు. రానున్న కౌంటింగ్ నేపథ్యంలో పోలీసులు అప్రమత్తంగా ఉండాలని వివాదాలకు పాల్పడితే కుల , మత , రాజకీయ నాయకులు ఎవరైనా ఎంతటి వారైనా వదిలేది లేదని ఎంతటివారినైనా ఉపేక్షించబోమని హెచ్చరించారు. ఇప్పటికే నరసరావుపేట సబ్ జైల్ నిండి పోయిందని ఇక అరెస్ట్ చేస్తున్న వారిని గుంటూరుకు తరలిస్తామన్నారు. పల్నాడు జిల్లాలో ఇప్పటికే 1200 మంది పై రౌడిషీట్ తెరిచామన్నారు. వచ్చే 1 నుండి 6 తేదీ వరకు పల్నాడు జిల్లాలో 144 సెక్షన్ కఠినంగా అమలు చేస్తామన్నారు. మందు బాబులు ఎవరైనా రోడ్డు మీదకు వచ్చి హంగామా చేసిన ప్రజలకు ఇబ్బంది కలిగిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. కౌంటింగ్ సమయానికి గొడవలు సృష్టిస్తే జైలుకు పోవడం ఖాయమన్నారు. కౌంటింగ్ అనంతరం గెలిచిన అభ్యర్థి సంబరాలు, సభలు, సమావేశాలు చేయరాదన్నారు. కౌంటింగ్ కేంద్రాల అనుమానాస్పదంగా తిరిగితే అదుపులోకి తీసుకుంటామన్నారు. పల్నాడులో అల్లరిమూకలపై పోలీసులు ఉక్కుపాదం మోపుతామన్నారు. పల్నాడులో ప్రశాంత వాతావరణం నెలకొల్పేందుకు పోలీసు శాఖ చేస్తున్న కృషితో ప్రజలు సహకరించాలని ఎస్పీ కోరారు.

రాష్ట్ర స్థాయి పవర్‌లిఫ్టింగ్ విజేతలకు బహుమతుల ప్రదానం

ప్రజాశక్తి - మంగళగిరి



విజేతలను ప్రకటిస్తున్న నిర్వాహకులు

గుంటూరు జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఫిట్ జోన్ జిమ్ మంగళగిరి ఈద్గా షాది ఖానాలో నిర్వహిస్తున్న ఆంధ్రప్రదేశ్ పవర్ లిఫ్టింగ్ పోటీలు రెండో రోజు గురువారం జరిగాయి. మహిళల కొన్ని విభాగాలో విజేతలైన వారికి బహుమతి ప్రధానోత్సవం జరిగింది. అని గుంటూరు జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసి యేషన్ అధ్యక్షులు కొమ్మాకుల విజయ భాస్కరరావు, ప్రధాన కార్యదర్శి షేక్ సంధాని సంయుక్తంగా తెలియజేశారు. కార్యక్రమంలో వైయస్సార్ సిపి నాయకులు దొంతి రెడ్డి వేమారెడ్డి, గుంటూరు జిల్లా స్వర్ణకార సంఘం అధ్యక్షులు పారేపల్లి మహేష్, వీజే జూనియర్ కళాశాల కరస్పాండెంట్ పి రాజశేఖర్, రాష్ట్ర పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్షులు ఎం ప్రభాకర్, ప్రధాన కార్యదర్శి సకల సూర్యనారాయణ, గౌరవ అధ్యక్షులు గంటా వెంకటేశ్వరరావు, కోశాధికారి పివి సంజీవ్, అసోసియేషన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ సకల కోటేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

మతోన్మాద బిజెపిపై అమరుల స్ఫూర్తితో పోరాటం

సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి పాశం రామారావు

ప్రజాశక్తి - పెదనందిపాడు



మృతవీరుల స్తూపం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

పాలపర్రు అమర వీరుల స్ఫూర్తితో మతోన్మాద బిజెపిపై పోరాటం చేయాలని సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి పాశం రామారావు పిలుపిచ్చారు.గురువారం మండలంలోని పాలపర్రు గ్రామంలో పాత బాపట్ల తాలూకా మృత వీరుల సంస్మరణ సభ మండల కార్యదర్శి దొప్పలపూడి రమేష్ బాబు అధ్యక్షతన జరిగింది.సభకు ముందుగా పాలపర్రులో సిపిఎం శ్రేణులు ర్యాలీ నిర్వహించారు. అనంతరం అమర వీరుల స్థూపాల వద్ద నివాళులర్పించారు. ఈ సందర్భంగా నిర్వహిం చిన సభలో పాశం రామారావు మాట్లాడారు. ఆనాటి నైజాం నిజాం పాలనకు వ్యతిరేకంగా వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం స్ఫూర్తితో, ఆంధ్ర ప్రాంతంలో కూలీరేట్ల పెంపు కోసం, వెట్టి చాకిరి విముక్తి కోసం, పెత్తందారులకు వ్యతిరేకంగా, సమ సమాజ స్థాపన ధ్యేయంగా, హక్కుల సాధన కోసం కమ్యూనిస్టు పార్టీ నాయకులు పోరాటం చేశారని తెలిపారు. ఈ పోరాటాలను అణిచివేసేందుకు ఆనాటి కాంగ్రెస్ పాలకులు కమ్యూనిస్టులపై నిషేధం విధించి, నిర్బంధ కాండ కొనసాగించాలని తెలిపారు. దున్నేవానికి భూమి దక్కాలని, భూస్వామ్య వ్యవస్థ, నిజాం పాలన అంతం కావాలని జరిగిన పోరాటంలో 1947-50 మధ్య కాలంలో పెదనందిపాడు, తెనాలి ప్రాంతంలోని 14 మంది కమ్యూనిస్టు యోధులు పోలీసు తూటాలకు బలి అయ్యారని అన్నారు. వారిలో పాలపర్రు గ్రామానికి చెందిన 8 మంది యువకిశోరాలు, ఇతర ప్రాంతాలకు చెందిన 6 గురు వీరులు ప్రాణాలు అర్పించారని అన్నారు. ప్రజల కోసం తమ ప్రాణాలను ఫణంగా పెట్టి పోరాడిన మృతవీరుల ఆశయాలను ముందుకు తీసుకు వెళ్లటమే వారికి ఇచ్చే ఘన నివాళి అని తెలిపారు. కానీ నేడు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం మతోన్మాద, కార్పోరేట్ అనుకూల వైఖరితో ప్రజలను తీవ్ర ఇబ్బందులు పెడుతుందన్నారు. మత ఘర్షణలు, జాతుల మధ్య విభేదాలు తీసుకువచ్చి భిన్నత్వంలో ఏకత్వంగా ఉన్న మన భారత దేశ సమగ్రతను నాశనం చేస్తుందన్నారు. రాజ్యాంగాన్ని మార్చే కుట్రకు కూడా బిజెపి తెర తీస్తుందన్నారు. ప్రశ్నించిన ప్రతిపక్ష పార్టీల నాయకుల పై దర్యాప్తు సంస్థలను ఉసిగొల్పి నిర్బంధాలకు గురిచేస్తుందన్నారు. రాష్ట్రంలోని అధికార, ప్రతిపక్ష పార్టీలు బిజెపికి వంత పాడుతున్నాయని, బిజెపి మతోన్మాద వైఖరి మీద రాజీలేని పోరాటం చేస్తుంది కమ్యూనిస్టు పార్టీలు మాత్రమేనని తెలిపారు. సమాజంలో దోపిడీ కొనసాగినంత కాలం కమ్యూనిస్టు పార్టీ ఉంటుందని, కమ్యూ నిజం, మార్క్సిజం అజేయం అన్నారు. నేటి మతోన్మాద బిజెపి విధానాలపై అమరవీరుల స్ఫూర్తితో పోరాటం కొనసాగించాలని తెలిపారు. సిపిఎం మండల కార్యదర్శి రమేష్ బాబు మాట్లాడుతూ పాలపర్రులో చింతల తోపు వద్ద అమర వీరులను కాల్చి చంపిన ప్రదేశంలోనే సమాధులు ఉన్నాయని, 1983లో సిపిఎం ఆధ్వర్యంలో పాలపర్రు చెరువు కట్టమీద పునర్ నిర్మాణాన్ని చేపట్టి స్మారక సభలను ప్రతి సంవత్సరం నిర్వహిస్తున్నామని తెలి పారు. కార్యక్రమంలో గుంటూరు ఛానల్ పోరాట ఐక్యవేదిక నాయ కులు నరిశెట్టి ఆచారి, సిపిఎం సీనియర్ నాయకులు పోపూరి సుబ్బారావు, టి ప్రతాపరెడ్డి, పిఎన్ఎం జిల్లా కార్యదర్శి దేవరకొండ శ్రీనివాసరావు, నాయకులు జంపని రామారావు, ముద్దన వెంకటేశ్వర్లు, కొత్త వెంకట శివరావు, బండి శంకరయ్య, కాపు వెంకట సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.



పాలపర్రులో ప్రదర్శన